


# మైత్రి నేస్తం

జూన్ 2026
రు. 20/-

సంకల్ప బలం







అంతర్జాతీయ
యోగ దినోత్సవం
జూన్ 21

## అంతర్జాతీయ
## యోగా దినోత్సవ
## శుభాకాంక్షలు

RNI No. TELTEL/2011/39497 JUNE 2026 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st June Date of Posting:8th June



సుమన్ కళ్యాణ్ పుర్
(1937-2026)

Published, Edited and Printed by T Shanti at Flat No. 504, Tower A06, Rajiv Sahabhavana
Nagole-Bandlaguda, Hyderabad-500068. Phone 9490571297 email: teega51@gmail.com
www.chaitanyam.net, Printed at Printography, 5-4-114, Ranigunj, Secunderabad-500001



వ్యవస్థాపక సంపాదకురాలు
తీగవరపు శాంతి

చైతన్యం
సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

జూన్ 2026

సంపుటి -15 సంచిక - 9

## ఈ సంచికలో....

సంపాదకీయం 4

వార్తా విశేషాలు 7

కాశీ మజిలీ కథలు 34

క్షమ యొక్క ఔన్నత్యం 38

తూర్పు గోదావరి జిల్లా 40

కలియుగ ప్రత్యక్ష దైవం 42

శ్రీ ఆంజనేయం 44

మీకు తెలుసా 47

జర్నలిస్ట్ ఫోరం 50

రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

జూన్ నెల అధిక జ్యేష్ఠ మాంసంతో ప్రారంభమైంది. అధిక మాసం అంటే శ్రీ మహావిష్ణువుకు చాలా ఇష్టమని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు. పంచాంగం ప్రకారం అధిక మాసాన్ని పురుషోత్తమ మాసం అంటారు. ఈ మాసం జూన్ నెల 15వ తేదీ వరకు ఉంటుంది. ఈ సమయంలో భక్తులు నిత్యం మహా-విష్ణువుతో పాటు లయకారుడైన పరమ శివుడిని, విఘ్నేశ్వరుడిని ఆరాధించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని పండితులు చెబుతున్నారు.

తెలంగాణ వార్తలు :.

ప్రపంచంలోనే అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ --- సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాదుకు దక్షిణాన భారత దేశానికే తలమానికంగా ప్రపంచ స్థాయి పరిమాణాలతో ఫ్యూచర్ సిటీ నిర్మించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు (ORR). రీజనల్ రింగ్ రోడ్డు (RRR ) మధ్యలో 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో దీనిని అభి-వృద్ధి చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని 7 మండలాల్లోని 56 గ్రామాలను ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ నగరాన్ని పర్యవేక్షించడానికి ఎఫ్ సి డీ ఏ ( ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ -- FCDA) ఏర్పాటు చేశారు. దీని ఛైర్మన్ గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారు.

ఇక్కడ AI సిటీ , స్కిల్ యూనివర్సిటీ , స్పోర్ట్స్ విలేజ్ , హెల్త్ సిటీ మరియు పర్యాటక రంగాలకు పెద్ద పీ వేయనున్నారు . మొత్తం 30 వేల ఎకరాల విస్తీర్ణంలో 9 ప్రధాన జోన్లుగా ఈ మాస్టర్ ప్లాన్ రూపొం-దించబడింది.

పరిశ్రమలు వాడే యంత్రాలు, పరికరాలు ఇక కళాశాల ల్యాబ్ లోనే మేము ఆధునికమైనవి వాడుతుంటే, విద్యార్థులు ఎన్నో ఏళ్ల క్రితం వాడిన యంత్రాలపై శిక్షణ పొందుతూ ఉండడంతో, మేము మళ్లీ శిక్షణ నివ్వాల్సివస్తోంది. మేము ఆధునికమైనవి వాడుతున్నాము. మీ సిలబస్, ల్యాబ్ లు మారాలని పరిశ్రమల ప్రతినిధులు తరచూ సూచనలు ఇస్తూనే ఉన్నారు. ఇప్ప-టివరకు ఇదే పరిస్థితి ఉన్నా ఇక ముందు ఇలాంటి మాటలు వినిపించవు.

మన విద్యా విధానంలో చాలా మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందని విద్యార్థుల నుంచి , పరిశ్రమల నుంచి తరచూ వినిపిస్తున్న మాటలు.

ఇక్కడ విద్యా విధానం పూర్తి చేసుకున్న విద్యార్థులు దేశ విదేశాలలో ఉద్యోగం చేయాలనుకునే వారు, నేర్చుకున్న విద్యా విధానానికి సంబంధం లేకుండా అనేక ఇబ్బందులు పడుతున్నాం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంత మంది విద్యార్థులు, ప్రభుత్వాధికారులు, రాజకీయ వేత్తలు వి-దేశాలను చుట్టి వస్తున్నారు, కానీ అక్కడికి ఉపాధి కోసం వెళ్లే విద్యార్థులకు ఎటువంటి విద్య అవసరం ఉంటుంది అని ఆలోచించి, అవసరమైతే అందరితో చర్చలు జరిపి, ఉపాధి కల్పించే విద్య ను పాఠ్యాంశాలలో చేర్చవలసిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే బ్రతుకు తెరువుకు, ఉపాధి కోసం అనేక మార్గాలు ఉన్నాయి. వారి వారి అభిరుచిని బట్టి, ఆ మార్గాలకు ప్రభుత్వం బాట వేస్తే, ప్రజలు తేలికగా అందుకో గలుగుతారు. సుఖంగా జీవించడమే కాకుండా , మన దేశం కూడా అభి-వృద్ధి చెందుతుంది. దీనికి ప్రజలు, ప్రభుత్వం కలిసి బాటలు వేయాలి.

"మన చైతన్యం సంకల్పబలం" విదేశాలలో ముఖ్యంగా గమనించింది ఏమిటంటే వి-ద్యల్లో ఆరితేరిన వారంతా విదేశాలకు వెళ్లి స్థిరపడి పోతున్నారు. అదీ ముఖ్యంగా అమెరికాలో . ఇటు పౌరోహిత్యం లో వేదపండితులైతే నేమి, నర్సులు, డాక్టర్లు, ఇంజనీర్లు, అలా అత్యంత ప్రతిభా-వంతులంతా విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్నారు. దానికి కారణం ఒక విధంగా మనం, మన ప్రభుత్వం అనే చెప్పచ్చు. వారి ప్రతిభను మనం గుర్తించి, వారి ప్రతిభకు తగిన జీతాలు ఇవ్వక , వారికి తగిన విలువ నివ్వక పోవడంతో వారి తెలివితేటలు మనం వాడుకోలేకపోతున్నాము.

అంత తెలివైన వారిని విదేశాలు గుర్తించి అక్కడ వారికి తగిన ప్రోత్సాహం ఇచ్చి, ప్రోత్సాహకా-లు ఇచ్చి వారి దేశాలు అభివృద్ధి చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా మనమంతా మన లోపాలకు స్వస్తి చెప్పి, నీతి నియమాలకు కట్టుబడి, లంచాలకు దూరంగా ఉంటే మన దేశం బాగుపడుతుంది అనడంలో సందేహం లేదు.

దానికి తోడు మన దేశంలో స్త్రీ పురుష వివక్ష కూడా ఎక్కువగా ఉంది . స్త్రీ కూడా అన్ని రకాల బాధ్యతలు పంచుకోవడానికి ముందుకు వస్తోంది . ఐటి నుండి అంతరిక్షం వరకు తన ప్రతిభను చాటుకుంటోంది .

అయితే పురుషాహంకారంతో ఇంకా పురుషులు స్త్రీని అధికారాలకు దూరంగా, రాజకీయాలకు దూరంగా నెట్టుతూ, వంటింటి కుందేలుగా ఉంచాలనే భావన, స్త్రీ తక్కువ ఏ భావన , కొందరు పురుషులలో ఇంకా పోవడం లేదు. ఆ భావన పోగొట్టవలసిన అతి ముఖ్యమైన బాధ్యత మాత్రం స్త్రీదే. నాతో సమానంగా చదువుకుంటున్న స్త్రీతో, మనం కూడా సమానంగా వంటింటి బాధ్యతలు దగ్గరనుండి సమానంగా పంచుకుందాం అనే ఆలోచన పురుషులలో ఇంకా చాలా మందిలో రాలేదనే చెప్పాలి. ఈ విషయంలో తల్లి కూడా సమాన బాధ్యత కొడుక్కి కూడా అప్పగించాలి.

స్త్రీలు పురుషునికి సమాన బాధ్యత అప్పగించినప్పుడే, తనకు శారీరక శ్రమ తగ్గి, వేరే పనుల మీద శ్రద్ధ పెట్టగలుగుతుంది. ద్దెనికి వయస్సుతో సంబంధం లేకుండా ఇద్దరూ కలిసి మెలిసి చేసుకోవాలి. అహంకారాలకు తావివ్వకూడదు.

ప్రభుత్వం, ప్రజలు ఈ విషయాన్ని చాలా సీరియస్ గా తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. స్త్రీపురుషులిద్దరూ అన్నిపనులు సమానంగా పంచుకుని చేసిననాడు, బాధ్యతలు తెలిసి కుటుంబ వ్యవస్థ బాగు పడటమే కాక, దేశాలు కూడా అభివృద్ధి చెందుతాయి అనడం నిర్వివాదాంశం.

తేలిక పాటి వర్షాలతో చల్లబడిన రుతుపవనాలు

నైరుతి రుతుపవనాల ఆగమనానికి సూచనగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఎండ ఘాల్పులతో ఠారెత్తిన జనం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురవడంతో ప్రజలు ఒక్కసారి హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

కానీ ప్రజలు ఎండ వేడిమి నుండైతే తప్పించుకున్నారు కానీ తెలుగు దేశాలలో వర్షాలు పడితే, వేరే రకమైన బాధలు. హైదరాబాద్ లో అయితే రోడ్లన్నీ నీటితో నిండి పోయి, గుంతలు కనిపించక, ఆ నీటిలో ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. ఇక ఆంధ్ర ప్రదేశ్ లో అయితే పల్లెటూళ్ళలో ఇళ్ల ముందు నీరు నిలిచిపోయి, ఆ నీళ్ళల్లో నడవలేక కాలుజారి పడుతూ అనేక ఇబ్బందులు పడే వారు ఎందరో! ప్రభుత్వం ఇటు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది.

కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక మార్పులా? చోటెవరికి? వేటు ఎవరికి? రెండున్నరేళ్లుగా ఖాళీగా ఉన్న రెండు మాన్యుట్రి పదవుల భర్తీకి హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా? కేబినెట్ విస్తరణ కాక, శాఖల పునర్విభజన కూడా యూదాబోతుందా? స్పీఎకర్ మార్పు, డిప్యూటీ సీఎం పోస్టుపై కొత్త సమీకరణాలు వినిపిస్తున్నాయా? ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ఇవే చర్చలు.

ఆంధ్ర ప్రదేశ్ వార్తలు :

యోగా డే -- జూన్ 21 ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర --2026 ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా విజయవాడ బీఆర్ టీ ఎస్ రోడ్డులో పోలీస్ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సీపీ రాజ శేఖర్ బాబు నిర్వహించిన ఈ కార్యక్రమానికి హోం మంత్రిఅనిత ముఖ్య అతిథిగా హాజరై యోగాసనాలు వేశారు. జాతీయ వార్తలు :

ఆశా రేఖ గ్రీన్ ఎనర్జీ కొలువుల ప్రపంచంలో తెల్లారి లేచిన దగ్గర నుండి పడుకునే వరకు, ప్రతి వస్తువు కోసం కరెంట్ మీద ఆధార పడుతున్న మనకి గ్రీన్ ఎనర్జీ ఓ ఆశారేఖ రూపంలో ఎదురొస్తోంది. ఏ రంగం 44 లక్షల ఉద్యోగాలతో భారత్ లో ఓ వెలుగు వెలగబోతోందంటోంది . ఈ విషయాన్ని ఇంధన , పర్యావరణ నిపుణులతో కూడిన కౌన్సిల్ నివేదిక సమర్పించింది .

ధరలు ఆకాశానికి --- పేదవాని పొట్ట భూమిలోనికి

రోజు రోజుకి ధరలు పెరుగుతుంటే, పేదవారికి, మధ్య తరగతి వారికి పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఇంటిలో వాడుకునే గ్యాస్ ధర రెండోసారి '29 రూ' పెరిగింది. ఇక ఆటోలలో స్కూటర్ల-

లో వాడుకునే ఇంధనం ధర సంగతి చెప్పనక్కరలేదు. వీటిని ఆధారంగా చేసుకుని, ఆటోల వాళ్ళు ధరలు విపరీతంగా పెంచేశారు .

అదేమిటి? ఇంత రేటా? అంటే అమ్మా!.ఇంతకు ముందు మేము 50 రూ లకి టిఫిన్, 100రూ లకి భోజనం చేసేవాళ్ళం. ఇప్పుడు హోటల్ వాళ్ళు గ్యాస్ రేటు పెరిగింది అని, టిఫిన్ 100 రూ చేశారు. . భోజనం 150 రూ చేశారు .కట్టలేక ఒక్క పూటే తింటున్నాం అని ఒక ఆటో అబ్బాయి అంటే, అమ్మా .. ఈ ఎండలకు మాకు సరైన తిండి లేక మాకు యూరిన్ కూడా రావడం లేదు అంటున్నాడు. ఆ డబ్బులే కాక ఇంకా ఇవ్వండమ్మా! అంటాడు.

ఆటో ఎక్కే వాళ్లకు అన్ని డబ్బులు ఇచ్చే స్థోమతే ఉంటే, ఆటోలోనే వెళ్లరు కదా! బాగా ఉన్న వాళ్ళు, పెన్షన్లు పుచ్చుకునే వారికైతే ఇబ్బంది ఉండదు. ఎందుకంటే ప్రభుత్వం డి ఏ లు పెంచుతూ ఉంటే,అలాంటి వారికి ధరలు ఎంత పెరిగినా బాధ ఉండదు. పెన్షన్లు ఏమీ రాని వారు, పిల్లల మీద ఆధార పడే వారు, పైన చెప్పిన ఆటోలు నడుపుకుని జీవించే అతి సామాన్యుల జీవితాలు అత్యంత బాధాకరం గా ఉంటున్నాయి. ఈ అక్షర సత్యాలను ఈ విధంగా ఎడిటోరియల్ లో వ్రాయవలసిన పరిస్థితి ఏర్పడిందంటే ప్రభుత్వం అర్థం చేసుకుని, తగిన చర్యలు తీసుకుని, అందరూ హాయిగా బ్రతికేందుకు ధరలు తగ్గే చర్యలు తీసుకోవాలని "చైతన్యం సంకల్పబలం " కోరుకుంటోంది.

అంతర్జాతీయ వార్తలు :

7.5 క్యారెట్ల సింథటిక్ వజ్రాన్ని కొనాలనుకున్నా -- జిల్ బైడెన్ జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రధాని మోదీ బహుకరించిన 7.5 క్యారెట్ల వజ్రాన్ని, అమెరికా ప్రథమ మహిళ జిల్ బైడెన్ గుర్తు చేసుకున్నారు. మోదీ బహుమతిగా ఇచ్చిన వజ్రాన్ని తన వద్దే ఉంచుకోవాలని తొలుత అనుకున్నానని , కానీ అమెరికా అధికారులు దానికి ఎక్కువ విలువ కట్టడంతో ఆ డైమండ్ ను ఫెడరల్ ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసినట్లు ' వ్యూ ఫ్రమ్ ది ఈస్ట్ వింగ్ : ఎ మెమోయిర్' అనే ఆత్మ కథ లో రాసుకొచ్చారు.

అమెరికాలో భారత మామిడి పండ్ల హవా

అమెరికా మార్కెట్లను భారత మామిడి పండ్లు ముంచెత్తుతున్నాయి మామిడి ఎగుమతులపై అమెరికా మార్కెట్లలో ఉన్న గిరాకీ గురించి అవగాహన కల్పించేందుకు సియాటిల్ లోని భారత కాన్సులేట్ జనరల్ ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. 'మ్యాంగో మ్యాజిక్: ప్రమోషన్ అండ్ టేస్టింగ్ ఈవెంట్ ఆఫ్ ఇండియన్ మ్యాంగోస్' పేరుతో నిర్వహించిన ఈ వేడుకకు 100 మందికి పైగా భారత మామిడి పండ్ల దిగుమతి దారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా అతిథులకు కాన్సులేట్ ప్రతినిధులు మహారాష్ట్రకు చెందిన ఆల్ఫానో కేసర్ , ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన బంగినపల్లి , హిమాయత్ , ఉత్తరప్రదేశ్ కు చెందిన లాంగ్ డా, దశహరీ, గుజరాత్ కు చెందిన రైప్ రాజాపురి పండ్ల రుచులను అతిథులకు చూపించారు. కోస్టుకో వైస్ ప్రెసిడెంట్ బాబ్ హస్కీ మాట్లాడుతూ ... కేసరి మామిడి పండ్లను స్టోర్లలో పెట్టిన రెండు గంటలకే అమ్ముడుపోతున్నాయి అని తెలిపారు.

మన భారత దేశ ప్రజలు ఎక్కడ ఉన్నా, వారి మనసంతా మన తల్లి ఐన భారతదేశం మీదే ఉంటుంది.

ప్రజలంతా కడుపునిండా తింటూ, ప్రతి వారి జీవితం ఆనందమయం
కావాలని కోరుకుంటూ .. సర్వే జనా సుఖినోభవంతు



తీగవరపు శాంతి

# వార్తా విశేషాలు

## రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా తెలంగాణ అవతరణ దినోత్సవాలు

స్వరాష్ట్రంగా పుష్కరకాలాన్ని పూర్తిచేసుకున్న తెలంగాణ.. మరో వసంతంలోకి అడుగుపెట్టింది. 12ఏళ్ల క్రితం తెలంగాణ రాష్ట్ర దశాబ్దాల కల సాకారమైన సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా అవతరణ దినోత్సవాలు ఘనంగా జరిగాయి.

హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరిగిన అధికారిక వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని.. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా... జిల్లా కేంద్రాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు వేడుకల్లో పాల్గొన్నారు. ఇటు తెలంగాణ భవన్ లో జరిగిన వేడుకల్లో కేటీఆర్; గాంధీ భవన్ లో జరిగిన వేడుకల్లో మహేశ్ కుమార్ గౌడ్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతోపాటు గ్రామగ్రామాన అవతరణ దినోత్సవాలు అట్టహాసంగా జరిగాయి.

## తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రులు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం గొప్ప సాంస్కృతిక వారసత్వ సంపదతో పాటు, కష్టపడి పనిచేసే తత్వం ఉన్న ప్రజలతో విరాజిల్లుతోందని రాష్ట్రపతి ప్రశంసించారు. గత కొన్నేళ్లుగా తెలంగాణ నూతన ఆవిష్కరణలు, సమగ్ర అభివృద్ధిలో గణనీయమైన పురోగతిని సాధించిందని కొనియాడిన రాష్ట్రపతి.. భవిష్యత్తులోనూ తెలంగాణ మరింత ప్రగతిపథంలో పయనించాలని ఆకాంక్షించారు.

ఎక్స్ వేదికగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ.. తెలంగాణ ప్రజల సృజనాత్మకతను, వ్యాపార నైపుణ్యాలను అభినందించారు. తెలంగాణ రాష్ట్రం ధైర్యానికి, సంకల్పానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన గొప్ప చరిత్రను కలిగి ఉందని పేర్కొన్నారు. 'వికసిత భారత్' అనే స్వప్నాన్ని సాకారం చేసే దిశగా తెలంగాణ అభివృద్ధి ప్రస్థానానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు.

విశిష్టమైన సంస్కృతి, అద్భుతమైన పారిశ్రామిక నైపుణ్యంతో దేశ గమనంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కొనియాడారు. మరిన్ని ప్రగతి శిఖరాలను అధిరోహిస్తూ, భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను తెలంగాణ మరింత గొప్పస్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

## ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్ధిపేట్ జిల్లాలో వివిధ రంగాలలో సాంస్కృతిక కలలు, క్రీడలు, సమాజ సేవ, పాండిత్యం, సాహసరంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలలను ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా మహిళా శిశు వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి శారద తెలిపారు.మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డ్ ల కోసం అర్హులైన చిన్నారులకు 2026-2027 లో భాగంగా అందించనున్న బాలశక్తి పురస్కార్ అవార్డులకు 31.07.2026 వ తేదీలోగా ఆన్ లైనులో దరఖాస్తు చేసుకోవాలని,దీనికి 5 సంవత్సరాల నుంచి 18 ఏళ్ల లోపు బాల బాలికలు వివిద రంగాలలో అనగా ఆవిష్కరణ మరియు సృజనాత్మకత, మంచి అభ్యాస వాతావరణం, సాంస్కృతిక కళలు, సాహసం, క్రీడలు, సామజిక సేవ, శాస్త్ర, సాంకేతిక మరియు ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన బాల బాలికలు https://awards.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పిల్లల్లోని శక్తి సంకల్పం సామర్థ్యాలు పట్టుదల ఉత్సాహాన్ని గౌరవించే విధంగా ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని దీనిని సిద్దిపేట జిల్లాలోని ఐదు నుంచి 18 సంవత్సరాల లోపు బాల బాలికలు వినియోగించుకోవాలని సూచించారు.

## మంచిర్యాల జిల్లాలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

మంచిర్యాల జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో జిల్లా ముందుకు వెళ్తోందని, ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్రావు అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా మంచిర్యాల జిల్లా నస్పూర్లోని కలెక్టరేట్లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హర్కర వేణుగోపాల్ రావు జాతీయజెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాని భారతదేశంలోనూ, ప్రపంచ స్థాయిలోనూ అగ్రస్థానం నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్థిక సామాజిక పరిపాలన రంగంలో ఆదర్శవంతమైన లక్ష్యాలతో క్యూర్ ప్యూర్ రేర్ నినాదంతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో ముందుకు సాగుతుందని, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలకు మరింతగా చేరువ చేయాలనే సంకల్పంతో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందని, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రాష్ట్రంలోనే ప్రతి కుటుంబానికి వర్తింపజేసి 5 లక్షల రూపాయల బీమా పొందేల నూతన పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతుందని అన్నారు... బైట్ హర్కర వేణుగోపాల్ రావు (రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు) ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, డీసీపీ భాస్కర్ మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

యాంకర్ విజువల్స్ బైట్ : ఆదిలాబాద్ జిల్లాలో 12 వ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అంతకుముందు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, రెండు విడతల్లో ఇందిరమ్మ గృహాలు, రూ. 21,666 కోట్ల రైతు రుణమాఫీ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డు, ఏడాదిలో 59,000 ప్రభుత్వ ఉద్యోగాలు మహిళలాల ఆర్థిక పురోభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తుందని వివరించారు. వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ బోథ్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్ తో జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలలో విశిష్ట సేవలు అందించిన వారికి అవార్డులను ప్రధానం చేశారు.

## భద్రాచలం ఐటీడీఏలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ రెండును పురస్కరించుకొని. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు.. సుదీర్ఘ పోరాటం అమరవీరుల త్యాగాల ఫలితంగా 2014 జూన్ 2న 29వ రాష్ట్రంగా తెలంగాణ అధికారికంగా ఆవిర్భవించింది.. నాటినుండి ప్రతి సంవత్సరం జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని వేడుకగా నిర్వహిస్తున్నారు.. ఈ సందర్భంగా భద్రాచలంలోని ఐటీడీఏ గిరిజన సమీకృత అభివృద్ధి సంస్థ లో ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ ఐఏఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా తెలంగాణ తల్లికి అంబేద్కర్ జైశంకర్ చిత్రపటాలకు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని వాటిని విజయవంతంగా మారుమూల గిరిజన ప్రజల వరకు అందించడం జరుగుతుందని ముఖ్యంగా విద్య వైద్యం వ్యవసాయం ఉపాధి రంగాలలో గిరిజనులు అభివృద్ధి వైపు పయనిస్తున్నారని,గిరిజన మహిళలకు అనేక ఉపాధి మార్గాలను ఏర్పాటు చేయడంతో పాటు అటవీ ఉత్పత్తుల విక్రయశాల గిరిమార్ట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని.. అదేవిధంగా గిరిజనుల సాంప్రదాయ సంస్కృతులను కళ్ళకు కట్టినట్టు భావితరాలకు చూపించేలా గిరిజన మ్యూజియంను ఏర్పాటు చేయటం జరిగిందని అన్నారు.. ఇక్కడ కూడా అటవి ఉత్పత్తుల గిరిజన వంటకాలను వాటి రుచిలను అందించడం జరుగుతుందని. దీనితో గిరిజన మహిళలు తయారు చేసే నాణ్యతతో విక్రయిస్తున్నట్లు దీని ద్వారా మహిళలకు ఎంతో ఉపాధి లభిస్తుందని అన్నారు.. అదేవిధంగా విద్య వైద్యం వ్యవసాయ రంగాలలో గిరిజనులు ఎంతో చేయూత పొందుతున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు...

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం ప్రగతి మైదానంలో 12 వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరయ్యారు. మొదటగా మంత్రి అమర వీరుల స్థూపానికి పూల మాల వేసి నివాళులు అర్పించి, జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి నేటితో 12ఏళ్లు నిండాయని, రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను వైభవంగా జరుపుకుంటున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు శుభాభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక పేరిట మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తూ... ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే వంటగ్యాస్ సరఫరా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలతో పాటు సంపన్నులతో సమానంగా తెలంగాణ మహిళలతో విద్యుత్ ప్లాంట్ లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలకు 59 లక్షల 53 వేల రూపాయల చెక్కును, 478 స్వయం సహాయక సంఘాలకు 51 కోట్ల 6 లక్షల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను అందించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలను కలిగించారు.

## సంగారెడ్డిలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి జిల్లాలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు ఆయన ఐబీ గెస్ట్ హౌస్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపం దగ్గర పుష్పంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన అవతరణ దినోత్సవ వేడుకలకు హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కృషి మరువలేనిదని కొనియాడారు. రాష్ట్ర ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణను ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో "తెలంగాణ రైజింగ్-2047" విజన్కు రూపకల్పన జరిగిందని చెప్పారు. పేదల సంక్షేమం, ప్రపంచ స్థాయి మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన సాగుతోందని వివరించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున సంగారెడ్డి జిల్లాకు 5 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ మంజూరయ్యాయని, 3 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని 855 చౌక ధరల దుకాణాల ద్వారా 14 లక్షల 26 వేల మందికి ఆహార భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. యాసంగి సీజన్కు సంబంధించి 6 లక్షల 60 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి, 12 వేల మంది రైతులకు 159 కోట్ల రూపాయలు చెల్లించినట్లు మంత్రి వివరించారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఆవరణలో వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ రెండవ విడత లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్తో కలిసి ఆది శ్రీనివాస్ ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. సిరిసిల్ల నేతన్నల ఉపాధి కోసం గత ఏడాది 6 కోట్ల 22 లక్షల మీటర్ల వస్త్రోత్పత్తిని కేటాయించామని, ఈ ఏడాది ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి కోసం మొదటి విడతగా 3 కోట్ల మీటర్ల ఆర్డర్లను సిరిసిల్ల మ్యాక్స్ సంఘాలకు కేటాయించినట్లు చెప్పారు. నేతన్నల కోసం వేములవాడలో యారన్ డిపోను ఏర్పాటు చేసి నూలు సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు. రాజన్న ఆలయ విస్తరణ, నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను 111 కోట్ల 25 లక్షల రూపాయలతో శరవేగంగా చేపడుతున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా జిల్లాలో 6,448 ఇళ్లు మంజూరు కాగా, అత్యధిక శాతం నిర్మాణాలు పూర్తి చేసుకుని రాష్ట్రంలో జిల్లా రెండవ స్థానంలో నిలిచిందని చెప్పారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించినట్లు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## జగిత్యాలలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు.. హాజరైన మంత్రి మహమ్మద్ అజారుద్దీన్

తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవ వేడుకలు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంతో పాటు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టరేట్లో జరిగిన అధికారిక వేడుకలకు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జాతీయ జెండాను ఎగురవేశారు. స్వరాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరులందరికీ నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ.. ఎందరో అమరవీరుల త్యాగాల పునాదుల మీదే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్-2047" విజన్తో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, భూభారతి, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి పథకాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయని వివరించారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, మైనార్టీ సంక్షేమం, ఇందిరా మహిళా శక్తి పథకాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, అదనపు కలెక్టర్ రాజా గౌడ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లాలో రాష్ట్ర ఆవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లాలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పోలీసు గౌరవ వందనం స్వీకరించి వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు భాస్కరరావు, వెంకారెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి గుత్తా సుఖేందర్ రెడ్డి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష మేరకు రాష్ట్రం ఏర్పడిందని, దీని కోసం అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేశారని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలకు, స్వాతంత్ర సమరయోధులకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2026 మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను అమలు చేస్తోందని, ఇందులో భాగంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల ప్రగతిని గుత్తా సుఖేందర్ రెడ్డి వివరించారు.

## సిద్దిపేటలో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు.. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరిగాయి. డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. పలు ప్రభుత్వ శాఖల స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు, అది కోట్ల మంది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని తెలిపారు. త్యాగాల పునాదులపై నిర్మితమైన తెలంగాణ, నేడు అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా నిలిచిందని అన్నారు. దాశరథి కృష్ణమాచార్యులు చెప్పినట్లుగా తెలంగాణ కోటి రత్నాల వీణ అని, ఆ వీణ నేడు అభివృద్ధి రాగాలు పలుకుతోందని చెప్పారు. కాళోజీ నారాయణరావు కలలు కన్న ప్రజల తెలంగాణను ప్రజా పాలన ప్రభుత్వంలో సమానత్వంతో, ప్రగతితో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి, వారు సద్వినియోగం చేసుకునేలా గ్రామ స్థాయి వరకు అవగాహన కల్పించడం లక్ష్యంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పేరుతో 2026 మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 99 రోజుల 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యాచరణలో భాగంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, చేపట్టిన చర్యలు, సాధించిన ప్రగతిని పొన్నం ప్రభాకర్ వివరించారు.

## కరీంనగర్ జిల్లావ్యాప్తంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్క్వార్టర్స్లో ఏర్పాటు చేసిన అధికారిక వేడుకలకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు మెడల్స్ ప్రధానం చేయగా, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎన్నో త్యాగాలు, ఆత్మగౌరవ పోరాటాల ఫలితంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం నేడు 12 సంవత్సరాల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పరిపాలన సాగుతోందని చెప్పారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య, రైతు సంక్షేమం, మహిళా సాధికారత లాంటి 10 కీలక అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని 3,506 ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి, 2,913 పెండింగ్ ఫైళ్లను అధికారులు పరిష్కరించారని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో గత రెండున్నర సంవత్సరాలలో 52,116 మందికి ఉచితంగా ఆపరేషన్లు జరిగాయని, ఇందుకోసం ప్రభుత్వం 139 కోట్ల రూపాయలు చెల్లించిందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే నాలుగు అమలు చేస్తున్నామని, రాష్ట్రాన్ని, జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

## నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పి.సుదర్శన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ ఉత్సవాల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వేడుకలలో భాగంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించగా, ఉత్తమ శకటాలుగా ఎంపికైన గృహ నిర్మాణ, ఆర్టీసీ సంస్థలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ నృత్యాలు, కర్రసాము ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు.

## లోక్ భవన్ లో రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ లోక్భవన్లో మంగళవారం తెలంగాణ, గోవా, సిక్కిం రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ వేడుకల్లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రసిద్ధి చెందిందని అన్నారు. అదేవిధంగా, సిక్కిం దేశంలో అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రాల్లో ఒకటిగా, జీవ వైవిధ్య రాష్ట్రంగా గుర్తింపు పొందిందని తెలిపారు. అలాగే గోవా తన అద్భుతమైన సముద్ర తీరాలు, పర్యాటక ఆకర్షణలతో దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. రాష్ట్రాల మధ్య సాంస్కృతిక ఐక్యత, పరస్పర అవగాహనను పెంపొందించడమే 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్, హెచ్ ఎం డి ఏ గ్రౌండ్స్ లో ఆర్గానిక్ మేళా – ఎగ్జిబిషన్ అండ్ సేల్స్ కార్యక్రమం

హైదరాబాద్లోని నెక్లెస్ రోడ్, హెచ్ఎండీఏ గ్రౌండ్స్లో ఆర్గానిక్ మేళా – ఎగ్జిబిషన్ అండ్ సేల్స్ కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, గుత్తా అమిత్ రెడ్డి తదితరులు ఈ మేళాను సందర్శించి వివిధ స్టాల్స్ను పరిశీలించారు. ఈ మేళాలో సేంద్రీయ ఉత్పత్తులు, మిల్లెట్స్, ఆర్గానిక్ తేనె, డెయిరీ ఉత్పత్తులతో పాటు చేనేత, హస్తకళల వస్తువులు, వ్యవసాయ ఆవిష్కరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య రక్షణలో సేంద్రీయ ఆహార వినియోగం కీలకమని తెలిపారు. రైతులు, వినియోగదారుల మధ్య ప్రత్యక్ష అనుసంధానానికి ఇటువంటి మేళాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు, రైతులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## దేశంలో 24 రాజ్యసభ స్థానాల భర్తీకి ఈసీ నోటిఫికేషన్ విడుదల

దేశంలోని పలు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 24 రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు భారత ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో నాలుగేసి స్థానాల చొప్పున.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మూడేసి స్థానాల చొప్పున, అలాగే జార్ఖండ్లో రెండు స్థానాలకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఈనెల 8వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈనెల 9న నామినేషన్ల పరిశీలన జరగనుండగా, నామినేషన్ల ఉపసంహరణకు 11 వరకు గడువు ఇచ్చారు. ఈనెల 18వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదేరోజు సాయంత్రం 5 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. జూన్ 20వ తేదీ నాటికి ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తికానుంది.

## పీఎం స్వనిధి పథకం ప్రారంభమై నేటికి ఆరేళ్లు పూర్తి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకం ప్రారంభమై నేటికి ఆరేళ్లు పూర్తయింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ పథకం దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది వీధి వ్యాపారుల జీవితాల్లో పెద్ద మార్పు తీసుకువచ్చిందని మోదీ పేర్కొన్నారు. ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు అందించడం, ఆర్థికంగా వారిని బలోపేతం చేయడం, వ్యాపార వృద్ధికి కొత్త అవకాశాలు కల్పించడం ద్వారా ఈ పథకం వీధి వ్యాపారులకు ఎంతో తోడ్పడిందని వివరించారు. పీఎం స్వనిధి పథకం కేవలం ఒక పథకం మాత్రమే కాదని.. స్వయం ఉపాధి, స్వావలంబన, ఆత్మగౌరవంతో వీధి వ్యాపారులను బలోపేతం చేయడానికి, తద్వారా ఆత్మనిర్భర్ భారత్ పునాదిని బలోపేతం చేయడానికి ఉద్దేశించిన పథకం అని ప్రధాని తెలిపారు.

## ముగిసిన కాళేశ్వరంలోని సరస్వతి అంత్య పుష్కరాలు.. పుష్కర స్నానాలు ఆచరించిన మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలు ముగిసాయి.పుష్కరాల ముగింపు సందర్భంగా ఈ ఉదయం రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళేశ్వరం తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక అని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కాగా ఈ రోజు పుష్కరాలు ముగియనున్న నేపథ్యంలో భక్తులు పెద్ద ఎత్తున త్రివేణి సంగమ తీరానికి తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు.

## రైల్వే జోన్ ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ప్రారంభంతో ప్రాంతీయ రైలు రవాణాలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ తెలిపారు. రైల్వే జోన్ ప్రారంభం కార్యక్రమంలో భాగంగా విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, గుంతకల్లు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు, వివిధ శాఖల ప్రధానాధికారులతో విశాఖలో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ కోస్తా రైల్వే వ్యవస్థ మ్యాప్ ను ఆవిష్కరించారు. అనంతరం సందీప్ మాథుర్ మాట్లాడుతూ, కొత్త జోన్ ఏర్పాటు ద్వారా పరిపాలనా సామర్థ్యం పెరగడంతో పాటు ప్రయాణికులు, సరకు రవాణా సేవలు మరింత మెరుగుపడతాయని చెప్పారు. ప్రాంతీయ మౌలిక వసతుల అభివృద్ధి, ఆర్థిక పురోగతికి ఈ జోన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

## ఆంధ్ర రత్న బిరుదాంకితులు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జయంతి

విజయవాడ, 02 జూన్ 2026 : స్వాతంత్ర్య సంగ్రామంలో చరిత్రలో చీరాల-పేరాల ఉద్యమానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన వ్యక్తి ఆంధ్ర రత్న బిరుదాంకితులు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జయంతి ఈరోజు. దుగ్గిరాల గోపాల కృష్ణయ్య ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో 1889 జూన్ 2న జన్మించారు. స్కాట్లాండ్లో ఎంఎ చదువు పూర్తి చేసుకొని తిరిగి భారత్ కు వచ్చిన గోపాల కృష్ణయ్య స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. నాటి బ్రిటిష్ ప్రభుత్వం చీరాల-పేరాల గ్రామాలను పురపాలక సంఘాలుగా చేసినప్పుడు పన్నుల భారం అధికం అవుతుందని ప్రజలను గ్రామాలు ఖాళీ చేయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించారు. దీంతో బ్రిటిష్ ప్రభుత్వమే మున్సిపాలిటీని రద్దు చేసింది. ఈ చీరాల-పేరాల ఉద్యమ సారథిగా నిలిచిన గోపాల కృష్ణయ్య 1928 జూన్ 10వ తేదీన ఆయన తుదిశ్వాస విడిచారు.

## నీట్ పేపర్ లీక్ కేసులో ఐదుగురు నిందితుల జుడీషియల్ కస్టడీ పొడిగింపు

నీట్ పేపర్ లీక్ కేసులో అరెస్ట్ అయిన ఐదుగురు నిందితుల జుడీషియల్ కస్టడీని ఈ నెల 15 వరకు పొడిగిస్తూ ఢిల్లీ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. నిందితుల కస్టడీని పొడిగించాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ను ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ అజయ్ గుప్తా ఆమోదించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మంగీలాల్ ఖతీక్, వికాస్ బివాల్, దినేష్ బివాల్, యష్ యాదవ్, ధనంజయ్ లోఖండేల జుడీషియల్ కస్టడీ ముగియడంతో సీబీఐ అధికారులు వారిని కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు దర్యాప్తు పురోగతిలో ఉన్నందున నిందితులకు కస్టడీని పొడిగించాలన్న దర్యాప్తు సంస్థ విజ్ఞప్తిని న్యాయమూర్తి అంగీకరించారు.

## అగస్త్యమలై అటవీ ప్రాంతంలో ఆక్రమణల తొలగింపునకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని రక్షిత అగస్త్యమలై పర్యావరణ ప్రాంతంలో జరుగుతున్న ఆక్రమణలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రాంతంలో ఆక్రమణలను తొలగించేందుకు కాలపరిమితితో కూడిన ఒక ప్రణాళికను సిద్ధం చేసి, ప్రాధాన్యత ప్రాతిపదికన అమలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆక్రమణదారులుగా గుర్తించిన 118 మంది సర్వింగ్, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులపై క్రమశిక్షణ, చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన నిర్దిష్ట ఆదేశాలు, సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. అగస్త్యమలై పరిధిలోని రక్షిత ప్రాంతాలలో ఆక్రమణలు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉన్నాయని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ తరలింపు ప్రణాళికలో ఆక్రమణలను భౌతికంగా తొలగించడం, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం, ఆక్రమణల తొలగింపు తర్వాత అక్కడ తిరిగి పర్యావరణ పునరుద్ధరణ పనులు చేపట్టడం వంటి సమగ్ర చర్యలు ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

## భారత్లో ఈ-హైవేల అభివృద్ధి జరుగుతోంది: NHEV డైరెక్టర్ అభిజీత్ సిన్హా

ఎలక్ట్రిక్, ఎలక్ట్రానికల్లీ ఎనేబుల్డ్ హైవేల (ఈ-హైవేలు) అభివృద్ధి ద్వారా భారతదేశం స్మార్ట్, కనెక్టెడ్, స్థిరమైన రవాణా రంగంలో ఒక కొత్త శకంలోకి అడుగుపెడుతోందని నేషనల్ హైవేస్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (NHEV) డైరెక్టర్ అభిజీత్ సిన్హా అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ చొరవ భారతదేశ ఎలక్ట్రిక్ రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సులభతరమైన ప్రయాణం, రోడ్డు భద్రత, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకుందని సిన్హా తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రవాణా మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలనే ప్రభుత్వ విజన్ను అభిజీత్ సిన్హా హైలైట్ చేశారు. NHEV సంస్థ 2018-19 నుంచి దేశంలో ఎలక్ట్రిక్ హైవే మోడల్పై పనిచేస్తోందని సిన్హా వెల్లడించారు. ప్రతిపాదిత హైవే వ్యవస్థలో ఎలక్ట్రిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, ఇంటెలిజెంట్ డిజిటల్ సిస్టమ్స్, అత్యవసర స్పందన విధానాలను అనుసంధానించనున్నట్లు చెప్పారు. దీని ద్వారా మరింత సురక్షితమైన, సమర్థవంతమైన, సాంకేతికతతో కూడిన రవాణా నెట్వర్క్ను రూపొందించవచ్చని పేర్కొన్నారు.

## CBSE ఆన్స్క్రీన్ మార్కింగ్ సిస్టమ్ సేవల కొనుగోళ్లపై విచారణ కమిటీ ఏర్పాటు




సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఆన్-స్క్రీన్ మార్కింగ్ సిస్టమ్ సేవల కొనుగోళ్లకు సంబంధించిన వ్యవహారాలపై విచారణ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక సభ్యుడితో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ చైర్పర్సన్ ఎస్. రాధా చౌహాన్ నాయకత్వం వహిస్తారు. కమిటీ చైర్పర్సన్కు అవసరమైన సందర్భాల్లో ఇతర కార్యాలయాల నుంచి అధికారుల సహాయాన్ని పొందే అధికారం ఉంటుంది. ఈ కమిటీకి అవసరమైన సెక్రటేరియల్ సహాయాన్ని కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ అందిస్తుంది. కాగా ఈ విచారణ కమిటీ తన నివేదికను నెల రోజుల్లోగా పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగానికి (డీఓపీటీ) సమర్పించాల్సి ఉంటుంది.

## తెలంగాణపై నాకున్న ప్రేమ రాజకీయాలకు అతీతం: పవన్ కల్యాణ్

తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమని జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... తెలంగాణ పోరాట స్ఫూర్తి తనకు ఎప్పటికీ ఉత్తేజాన్నిస్తుందన్నారు. రాష్ట్రంలో లక్ష మందికి పైగా జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేన ఉంటుందని, ఎన్నికల్లో పోటీ చేస్తుందని, తాను కూడా తెలంగాణలో తిరుగుతానని తెలిపారు. ప్రజలకు జరుగుతున్న ప్రతి అన్యాయాన్ని ఎదిరిస్తామని, ప్రజా సమస్యలపై చర్చిస్తామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. తెలంగాణలో తాను అధికారం కోరుకోవడం లేదని, కేవలం ప్రజల్లో మార్పు రావాలనే ఆశ మాత్రమే ఉందని తెలిపారు. తనపై వచ్చే విమర్శలు, బెదిరింపులను తాను పెద్దగా పట్టించుకోనని, తన గుండెల్లో తెలంగాణ ఎప్పుడూ ఉంటుందని, కొన్ని వ్యాఖ్యలపై వచ్చిన వివాదం కారణంగా జనసేన కార్యకర్తలు స్పందించారని, అయితే అందులో తన ప్రత్యక్ష ప్రమేయం లేదని స్పష్టం చేశారు.

## ప్రధాని మోదీ పేరుతో ఆన్లైన్ పెట్టుబడి అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్

కేవలం 22,000 రూపాయల ప్రాథమిక డిపాజిట్తో నెలకు 3.5 లక్షల రూపాయల వరకు సంపాదించవచ్చంటూ ఫేస్బుక్లో సర్క్యులేట్ అవుతున్న ఒక వీడియో పూర్తిగా నకిలీదని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ ఒక పెట్టుబడి ప్లాట్ఫారమ్ను ప్రమోట్ చేస్తున్నట్లు చూపుతున్న ఈ వీడియో పూర్తిగా ఏఐ సాంకేతికతతో సృష్టించిన నకిలీ వీడియో అని తేల్చింది. భారత ప్రభుత్వం గానీ, ప్రధానమంత్రి గానీ ఎలాంటి పెట్టుబడి ప్లాట్ఫారమ్ను లేదా పథకాన్ని సిఫార్సు చేయలేదని పీఐబీ స్పష్టం చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

ఇలాంటి నకిలీ ప్రచారాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారిక ప్రభుత్వ వనరుల ద్వారా మాత్రమే ఇలాంటి క్లెయిమ్లను ధృవీకరించుకోవాలని పీఐబీ సూచించింది. సమాజంలో తప్పుడు సమాచారాన్ని అరికట్టేందుకు భాగస్వాములు కావాలని కోరింది. ఏదైనా అనుమానాస్పద కంటెంట్ కనిపిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ అధికారిక వాట్సాప్ నంబర్ +91 8799711259 లేదా ఇమెయిల్ factcheck@pib.gov.in ద్వారా నివేదించాలని స్పష్టం చేసింది.

## విద్య అనేది సాధికారతకు ఒక శక్తివంతమైన సాధనం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

విద్య అనేది ఒక శక్తివంతమైన సాధనమని, అది వ్యక్తులను స్వయం సమృద్ధులుగా, సమర్థులుగా మారుస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యూఢిల్లీలో స్కాలర్షిప్ పథకం లబ్ధిదారులైన గిరిజన యువతను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. సమాజంలోని అన్ని వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. ప్రభుత్వ స్కాలర్షిప్ పథకాలు గిరిజనులకు ఉన్నత విద్యను, నూతన అవకాశాలను అందిస్తూ వారి జీవితాలను మార్చివేస్తున్నాయని కొనియాడారు. భారత్ లో ప్రతిభకు కొరత లేదని, దాన్ని గుర్తించి, ప్రోత్సహించి, ఎదిగేందుకు సరైన వేదికను అందించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

గిరిజన వర్గాలకు చెందిన యువతను సాధికారత వైపు నడిపించేందుకు, వారిని ఆర్థికంగా పైకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. స్కాలర్షిప్ పథకాలు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, అవి యువత కలలకు రెక్కలు తొడిగే సాధనాలుగా ఉపయోగపడతాయని చెప్పారు. అపారమైన ప్రతిభ ఉండి, వనరుల కొరత కారణంగా ముందుకు సాగలేకపోతున్న యువత జీవితాల్లో ఈ స్కాలర్షిప్లు కొత్త అవకాశాల తలుపులు తెరుస్తాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. యువత దేశానికి బలం, ఆశ, ఉజ్వల భవిష్యత్తు అని అభివర్ణించిన ద్రౌపది ముర్ము.. యువత, ముఖ్యంగా గిరిజన తెగల వారు తమ మూలాలను, తమ ప్రజలను ఎప్పటికీ మరచిపోకూడదని పిలుపునిచ్చారు.



## 3 జూన్ న న్యూఢిల్లీలో జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం




దేశవ్యాప్తంగా విశిష్ట సేవలు అందించిన 42 ఉత్తమ పంచాయతీలకు జూన్ 3 వ తేదీన న్యూఢిల్లీలో జాతీయ పంచాయతీ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అవార్డులు సాధించిన పంచాయతీల సర్పంచులు, ప్రతినిధులు తాము సాధించిన విజయాలు, గ్రామాల్లో అమలు చేసిన ఉత్తమ పద్ధతులపై ప్రదర్శనలు (ప్రెజెంటేషన్లు) ఇవ్వనున్నారు. ఈ వేడుకలో భాగంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ కేటగిరీ కింద 34 గ్రామ పంచాయతీలకు అవార్డులు అందజేయనున్నారు. అలాగే నానాజీ దేశ్ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ కేటగిరీ కింద ఎనిమిది పంచాయతీలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు.

## విదేశీయుల రిజిస్ట్రేషన్ నిబంధనలలో కేంద్రం కీలక సవరణలు

భారత్‌కు 180 రోజుల వరకు వచ్చే విదేశీయులు తమ వీసా గడువు ముగిసేలోపు ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలను సవరించింది. ఒకవేళ వారు దేశంలో తమ బసను పొడిగించుకోవాలని భావిస్తే.. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వీసా గడువు తీరక ముందే పూర్తి చేయాల్సి ఉంటుంది. గతంలో 180 రోజుల గడువు ముగిసిన తర్వాత 14 రోజుల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం ఉండేది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ (అమెండ్‌మెంట్) రూల్స్, 2026'ను నోటిఫై చేస్తూ.. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ రూల్స్, 2025 లోని రిజిస్ట్రేషన్ కాలపరిమితి, అప్పీళ్ల యంత్రాంగంలో ఈ కీలక మార్పులను ప్రవేశపెట్టింది. ఇకపై నిర్దేశిత గడువు దాటిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అనుమతి ఇస్తారు.

ఈ నిబంధనలలో మొదటిసారిగా ఆన్‌లైన్ అప్పీల్ విధానాన్ని చేర్చారు. ప్రభుత్వ ఉత్తర్వుల వల్ల ప్రభావితమైన ఏ వ్యక్తి అయినా ఇప్పుడు బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ కమిషనర్‌కు ఆన్‌లైన్ ద్వారా అప్పీల్ చేసుకోవచ్చు. ఈ అప్పీల్‌ను సదరు ఉత్తర్వు అందిన 30 రోజుల లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. సంబంధిత పక్షాల వాదనలను విన్న తర్వాత కమిషనర్ తన నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. ఈ మొత్తం వ్యవహారాన్ని 60 రోజుల లోపు పరిష్కరించాల్సి ఉంటుంది.

## తెలంగాణలో ప్రతి పౌరుడి కోసం 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని తీసుకువచ్చాం: మంత్రి పొన్నం ప్రభాకర్

సకల జనులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నప్పటికీ కేసులు, దాడులు ఎదుర్కొని నష్టపోయిన వారిని గౌరవించి గుర్తించే కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం చేపడుతోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణలో ప్రతి పౌరుడికి అండగా ఉండేలా 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని తీసుకువచ్చామని, అలాగే 2 లక్షల పెన్షన్ల కార్యక్రమాన్ని కూడా లాంఛనంగా ప్రారంభించామని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమకారులు, కవులు, కళాకారులకు తగిన గుర్తింపు,గౌరవాన్ని ఇచ్చేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో ఉద్యమకారులందరినీ గుర్తించి గౌరవించుకుంటామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. ప్రజా పాలన ప్రభుత్వంలో మొదటి దశ కింద ఒక్కో నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించామని, రెండవ దశ కార్యక్రమాన్ని నిన్ననే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసిఫాబాద్లో ప్రారంభించారని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే వ్యవసాయ అధికారులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో సంవత్సరానికి 1.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరం కాగా, ప్రస్తుతం 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే పండుతోందని, రాబోయే రోజుల్లో రైతులకు విత్తనాల దశ నుంచే సన్న బియ్యం పండించడంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రతి రైతు ఆయిల్ ఫామ్ సాగు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, మన దగ్గర నర్మేటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కూడా ప్రారంభమైందని చెప్పారు. అలాగే ప్రతి ఒక్కరూ ఏకకాలంలో మొక్కలు నాటేలా గ్రామగ్రామాన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, లక్షల ఈత చెట్లను కాలువల గట్లు, ప్రభుత్వ స్థలాల్లో నాటడానికి ప్లాన్ చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

## పశ్చిమ బెంగాల్ కొత్త మంత్రుల శాఖల కేటాయింపు




ముఖ్యమంత్రి సువేందు అధికారి నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ కొత్త ప్రభుత్వంలో మంత్రుల శాఖల కేటాయింపు జరగనుంది. సచివాలయంలో జరిగే మంత్రివర్గ సమావేశం తర్వాత ఏ మంత్రికి ఏ బాధ్యతలు అప్పగించారనేది అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ నెల 1వ తేదీన బీజేపీకి చెందిన 35 మంది ఎమ్మెల్యేలు కొత్తగా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయడంతో, ప్రస్తుతం సీఎం సువేందు అధికారితో కలిపి మొత్తం మంత్రుల సంఖ్య 41కి చేరింది. బెంగాల్ అసెంబ్లీ నియమాల ప్రకారం గరిష్టంగా 44 మంది వరకు మంత్రులు ఉండే అవకాశం ఉండటంతో, భవిష్యత్తులో మరో ముగ్గురిని కేబినెట్లోకి తీసుకునే వీలుంది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడమే తమ మొదటి లక్ష్యమని ముఖ్యమంత్రి సువేందు అధికారి ఇప్పటికే ప్రకటించారు. అందుకే అందరి కళ్లూ ఇప్పుడు కీలకమైన ఆర్థిక, పరిశ్రమల శాఖలపైనే ఉన్నాయి. అయితే, పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. ఆర్థిక శాఖను సీఎం ప్రస్తుతానికి తన వద్దే ఉంచుకునే అవకాశం ఉంది. ఢిల్లీకి చెందిన ఒక ప్రముఖ ఆర్థికవేత్తను నందిగ్రామ్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో గెలిపించి, ఆ తర్వాత ఆయనకు పూర్తిస్థాయి ఆర్థిక మంత్రిగా బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. నేటి సమావేశంలో శాఖల కేటాయింపుతో పాటు బెంగాల్ అభివృద్ధికి సంబంధించి కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు కూడా తీసుకోనున్నారు.

## వివాహిత కుమార్తెలకు కారుణ్య నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు



కారుణ్య నియామకాల నుంచి వివాహిత కుమార్తెలను మినహాయించరాదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కుటుంబ నిర్వచనం నుంచి వివాహిత కుమార్తెలను మినహాయించడం స్పష్టంగా ఏకపక్షమైనదని, అన్యాయమైనదని, రాజ్యాంగ విరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. కారుణ్య నియామకం కింద, ఒక ఉద్యోగి ఉద్యోగంలో ఉండగా మరణించినా లేదా వైద్య కారణాల వల్ల ముందుగానే పదవీ విరమణ చేసినా, ప్రభుత్వం ఆ ఉద్యోగాన్ని కుటుంబ సభ్యునికి ఇస్తుంది. కారుణ్య నియామకం విషయంలో కుటుంబం అనే నిర్వచనంలోకి వివాహిత కుమార్తె రాదని పేర్కొన్న అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వును కొట్టివేస్తూ, జస్టిస్‌లు పి.ఎస్. నరసింహ, అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. కారుణ్య ప్రాతిపదికన ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్‌గా నియామకం చేయాలన్న తన అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ, మరణించిన డీలర్ వివాహిత కుమార్తె దాఖలు చేసిన అప్పీలును సుప్రీంకోర్టు విచారించింది.

కుటుంబం అనే నిర్వచనం నుండి వివాహిత కుమార్తెలను మినహాయించిన 2019 ప్రభుత్వ ఉత్తర్వును ఆ మహిళ సవాలు చేసింది. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న మరణించిన డీలర్ కుటుంబానికి తక్షణ సహాయం అందించడమే డిపెండెంట్ కోటా కింద కేటాయింపుల ముఖ్య ఉద్దేశ్యం కాబట్టి, ఆ నిర్వచనం నుండి వివాహిత కుమార్తెను మినహాయించడం సమర్థనీయం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభ్యంతరం

తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున పక్క రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ గడ్డపై నిలబడి మాట్లాడిన భాష, చూపిన వివక్ష తెలంగాణ అమరవీరులను అవమానించేలా ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అన్నారు. టీడీపీ-బీజేపీ కలిసి తెలంగాణపై మళ్లీ కుట్రలు చేస్తున్నాయనే అనుమానం కలుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఎవరైనా ఇక్కడ వ్యాపారాలు చేసుకోవచ్చు కానీ, తెలంగాణ అస్థిత్వాన్ని కించపరిస్తే సహించేది లేదని తెలిపారు. ఒక సీనియర్ రాజకీయ నాయకుడిగా సలహా ఇస్తున్నానని, డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై దృష్టి సారించాలని, రెండు ప్రాంతాలు అభివృద్ధిలో పోటీపడాలి తప్ప విద్వేషాల్లో కాదని హితవు పలికారు.

## బాసర ఐఐఐటీ సీట్లు సాధించిన కోరుట్ల విద్యార్థులకు సన్మానం చేసిన ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్

ఉన్నతమైన లక్ష్యాలతో చదువుకుంటే కెరియర్లో ఏదైనా సాధించవచ్చునని జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం నుండి బాసర ఐఐఐటీలో సీట్లు సాధించిన 42 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ సన్మానించి అభినందించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఐఐఐటీలో సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. ఒక లక్ష్యంతో ముందుకు వెళ్తే తప్పకుండా విజయం సాధించవచ్చునని విద్యార్థులకు సూచించారు.

ప్రపంచం మొత్తం ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వైపు వెళ్తోందని, విద్యార్థులు ఆ దిశగా ప్రయత్నం చేస్తూ తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ పాలనలో అనేక గురుకులాలు ఏర్పాటు చేయడం వల్లే ఈరోజు అనేక మంది విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సాధించగలిగారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత చదువులు చదివిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చర్లపల్లి జైలు నుండి 91 మంది యావజ్జీవ ఖైదీల విడుదల

తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన ప్రత్యేక రిమిషన్ (శిక్ష కాలం తగ్గింపు) మేరకు అర్హత సాధించిన 91 మంది యావజ్జీవ ఖైదీలు మంగళవారం చర్లపల్లి జైలు నుండి విడుదలయ్యారు. వారిలో 85 మంది పురుష ఖైదీలు, 6 మంది మహిళా ఖైదీలు ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ రెండో అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చట్టబద్ధమైన జీవితాన్ని గడపాలని, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా మారాలని ఖైదీలకు సూచించారు. కుటుంబాలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని, విజయవంతమైన పునరావాసానికి ఆదర్శంగా నిలవాలని కోరారు.

ఈ కార్యక్రమం కేవలం ఖైదీల విడుదల మాత్రమే కాదని, బాధ్యత, గౌరవం, ఆశతో కూడిన కొత్త జీవితానికి శ్రీకారం చుట్టే సందర్భమని డీజీ సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. ప్రతి వ్యక్తిలో మార్పు సాధించే శక్తి ఉందని, శిక్ష విధించడం మాత్రమే కాకుండా సంస్కరణ, సానుకూల మార్పుకు అవకాశం కల్పించడం కూడా కారాగార వ్యవస్థ ముఖ్య లక్ష్యమని తెలిపారు. విడుదలైన ఖైదీలు జైలు జీవితం మొత్తం తమ మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, సంస్కరణ పట్ల నిబద్ధత ద్వారా ఈ అవకాశాన్ని సంపాదించుకున్నారన్నారు. తెలంగాణ కారాగార శాఖ విద్య, వృత్తి శిక్షణ, ఉపాధి ఆధారిత కార్యక్రమాలు, కౌన్సెలింగ్, సంక్షేమ పథకాల ద్వారా జైళ్లను సంస్కరణ, నైపుణ్యాభివృద్ధి, పునరావాస కేంద్రాలుగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. ఖైదీ జైలు గేటు దాటిన తర్వాత కూడా పునరావాస ప్రక్రియ ముగియదని, విడుదల అనంతర సహాయం కూడా విజయవంతమైన పునఃసమైక్యానికి ఎంతో ముఖ్యమని సౌమ్య మిశ్రా పేర్కొన్నారు.

## CBSE ఛైర్మన్‌గా ఐఏఎస్ అధికారి లోఖండే ప్రశాంత్ సీతారాం

సీనియర్ ఐఏఎస్ అధికారి లోఖండే ప్రశాంత్ సీతారాం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కొత్త ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు సీబీఎస్ఈ ఛైర్మన్‌గా సేవలందించిన రాహుల్ సింగ్ స్థానంలో లోఖండే ప్రశాంత్ బాధ్యతలు చేపట్టనుండగా, రాహుల్ సింగ్‌ను కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖకు అదనపు కార్యదర్శిగా బదిలీ చేశారు. ఇక సీబీఎస్ఈ కొత్త కార్యదర్శి గా వరుణ్ భరద్వాజ్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం కేంద్ర ఉన్నత విద్యా శాఖలో డైరెక్టర్‌గా విధుల్లో ఉన్నారు. ఈ కీలక బదిలీలు, ఉన్నత స్థాయి నియామకాలకు కేంద్ర ప్రభుత్వ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది.

## సీబీఎస్ఈ (CBSE) 12వ తరగతి రీ-ఇవాల్యుయేషన్ కు 40 వేల మంది దరఖాస్తు

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) 12వ తరగతి విద్యార్థుల సమాధాన పత్రాల రీ-ఇవాల్యుయేషన్ (పునఃమూల్యాంకనం) ప్రక్రియను ప్రారంభించింది. ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా ఇప్పటివరకు దాదాపు 40 వేల మంది విద్యార్థులు తమ దరఖాస్తులను విజయవంతంగా సమర్పించారని బోర్డు వెల్లడించింది. మూల్యాంకనం చేసిన జవాబు పత్రాల స్కాన్డ్ కాపీలను పొందిన విద్యార్థులకు మాత్రమే ఈ రీ-ఇవాల్యుయేషన్ సదుపాయం అందుబాటులో ఉంటుందని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. ఈ దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి విద్యార్థులు ఫీజు చెల్లించడానికి ఎస్బీఐ (SBI), కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్లకు చెందిన పేమెంట్ గేట్వేలను పోర్టల్లో అందుబాటులో ఉంచారు. అయితే, విద్యార్థులకు ఈ నిర్దిష్ట బ్యాంకులలో ఖాతాలు ఉండాల్సిన అవసరం లేదని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. అభ్యర్థులు యూపీఐ (UPI), నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్స్, డెబిట్ కార్డ్స్ వంటి వివిధ ఆన్లైన్ పేమెంట్ ఆప్షన్ల ద్వారా ఈ గేట్వేలను ఉపయోగించి సులభంగా చెల్లింపులు చేయవచ్చని బోర్డు తెలిపింది.

## గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మెరుగుదలకు కేంద్రం కీలక ఒప్పందాలు

భారత గ్రామీణ ప్రాంతాల్లో సురక్షితమైన తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరచడానికి జల జీవన్ మిషన్ 2.0 కింద కేంద్ర ప్రభుత్వం నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంతో అవగాహన ఒప్పందాలు (MoUs) కుదుర్చుకుంది. అరుణాచల్ ప్రదేశ్, జార్ఖండ్, తమిళనాడు, నాగాలాండ్ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతంతో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ సంస్కరణలతో కూడిన ఒప్పందం.. గ్రామీణ నీటి పరిపాలనలో గ్రామ పంచాయతీల నాయకత్వానికి, సేవా ఆధారిత విధానానికి, సమాజ కేంద్రిత పద్ధతికి ప్రాధాన్యతనిస్తుందని జలశక్తి మంత్రిత్వ శాఖ తెలిపింది. బలమైన కమ్యూనిటీ భాగస్వామ్యం ద్వారా ప్రతి గ్రామీణ కుటుంబానికి తగిన పరిమాణంలో, నాణ్యమైన తాగునీటిని క్రమం తప్పకుండా అందించడమే లక్ష్యంగా పెట్టుకున్న




జల జీవన్ మిషన్ 2.0 ఉద్దేశాలకు అనుగుణంగా ఈ కార్యక్రమం సాగనుంది. కేంద్ర జలశక్తి మంత్రి

సి.ఆర్. పాటిల్, సంబంధిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర తాగునీరు-పారిశుధ్య శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ఈ ఒప్పందాలపై సంతకాలు జరిగాయి.

ఈ సందర్భంగా కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ మాట్లాడుతూ.. జల జీవన్ మిషన్ దేశవ్యాప్తంగా గ్రామీణ తాగునీటి సరఫరా రూపురేఖలను మార్చివేసిందని, ముఖ్యంగా మహిళలు, బాలికలు నీటి కోసం పడే కష్టాలను తగ్గించిందని పేర్కొన్నారు. దీనితో పాటు నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల రీఛార్జ్, వ్యర్థ జలాల నిర్వహణ, క్యాచ్మెంట్ ఏరియా రక్షణ, కమ్యూనిటీ ఆధారిత నీటి నాణ్యత పర్యవేక్షణ వంటి అంశాల అవసరాన్ని కూడా పాటిల్ నొక్కి చెప్పారు.

## నవభారత ప్రగతికి చోదక శక్తిగా మధ్యతరగతి.. మోదీ 12ఏళ్ల పాలనలో చారిత్రాత్మక సంస్కరణలు

మన దేశపు మధ్యతరగతి వర్గం నవభారత సామాజిక, ఆర్థిక విప్లవానికి చోదక శక్తిగా నిలుస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత పన్నెండేళ్ల కాలంలో భారతదేశపు మధ్యతరగతి జనాభా సమూల మార్పులకు లోనైంది. పన్నుల సంస్కరణలు, చౌక గృహవసతి, ఉచిత వైద్యం, డిజిటల్ సేవల విప్లవం ఇవాళ మధ్యతరగతి జీవితాలను ఎంతో సులభతరం చేశాయి. ప్రపంచ ఆర్థిక వేదిక అంచనాల ప్రకారం.. 2035 నాటికి చైనాను అధిగమించి ప్రపంచంలోనే అత్యధిక మధ్యతరగతి జనాభా కలిగిన దేశంగా




భారత్ అవతరించబోతోంది.

మధ్యతరగతి కుటుంబాలపై పన్నుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. కొత్త పన్ను విధానం కింద ఏటా 12 లక్షల రూపాయల వరకు ఆదాయం ఉన్న సామాన్యులకు,

నికర మినహాయింపులతో కలిపి 12.75 లక్షల రూపాయల వరకు సంపాదిస్తున్న వేతన జీవులకు సున్నా పన్ను సౌకర్యాన్ని కల్పించింది. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ జీవితానికి పూర్తి ఆర్థిక భద్రత కల్పిస్తూ 'యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (UPS) అమల్లోకి తెచ్చింది. గృహ, విద్యా రుణాల వడ్డీ రేట్లను ప్రభుత్వం భారీగా తగ్గించి ఈఎంఐ భారాన్ని పూర్తిగా తగ్గించింది. సొంత ఇంటి కల కోసం పీఎం ఆవాస్ యోజన (PMAY-U 2.0) ద్వారా రాబోయే ఐదేళ్లలో అదనంగా మరొక కోటి ఇళ్ల నిర్మాణానికి 8.76 లక్షల కోట్ల రూపాయలను కేటాయించింది. నిలిచిపోయిన గృహ నిర్మాణ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు తెచ్చిన 'స్వామిహ్' (SWA-MIH) ఫండ్ ద్వారా దేశవ్యాప్తంగా 58,000 కు పైగా ఇళ్లను పూర్తి చేసి మధ్యతరగతి కొనుగోలుదారులకు అండగా నిలిచారు.

నగరాల రవాణా వసతులలో మెట్రో రైల్ సేవలు నేడు 26 నగరాలకు విస్తరించాయి. రైల్వే బడ్జెట్ను పెంచి 'కవచ్' లాంటి స్వదేశీ రక్షణ వ్యవస్థను, వందే భారత్ స్లీపర్ రైళ్లను అందుబాటులోకి తెచ్చారు. వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించడంలో 'జనౌషధి' కేంద్రాలు మధ్యతరగతికి రక్షణ కవచంలా మారి 50 నుండి 80 శాతం తక్కువ ధరలకే నాణ్యమైన జనరిక్ మందులను అందిస్తున్నాయి. దీనివల్ల గత 11 ఏళ్లలో మధ్యతరగతి కుటుంబాలకు ఏకంగా 40,000 కోట్ల రూపాయల వైద్య ఖర్చులు మిగిలాయి. 70 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లందరికీ ఉచిత వైద్యం అందించేందుకు 'ఆయుష్మాన్ వయ వందన' కార్డులను అందిస్తున్నారు.

ఉన్నత చదువుల కోసం ఎలాంటి గ్యారెంటీ లేకుండా సులభంగా విద్యా రుణాలు అందించే 'విద్యా లక్ష్మి పథకం' ప్రవేశపెట్టారు. దేశంలో ఐఐటీలు, ఎయిమ్స్ సంస్థల సంఖ్యను భారీగా పెంచారు. మధ్యతరగతి యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చడంలో 'స్టార్టప్ ఇండియా', 'ముద్ర యోజన' కీలక పాత్ర పోషించాయి. గుర్తింపు పొందిన స్టార్టప్ల సంఖ్య నేడు 2.23 లక్షలు దాటిపోయి, ఏకంగా 23 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించింది. 'జామ్ త్రిమూర్తులు' (JAM Trinity) వ్యవస్థ ద్వారా మధ్యతరగతి ప్రజలకు దళారీల బెడద తప్పింది. 'డిజిలాకర్', 'ఉమాంగ్' యాప్స్ ద్వారా ప్రభుత్వ సేవలు మొబైల్ స్క్రీన్ పైనే లభిస్తున్నాయి. ఈ విధానాలు మధ్యతరగతి కుటుంబాలలో సరికొత్త నమ్మకాన్ని నింపాయి.

## ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ 81వ సెషన్ అధ్యక్షుడిగా బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి డాక్టర్ ఖలీలుర్ రహ్మాన్ ఎన్నిక

బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి డాక్టర్ ఖలీలుర్ రహ్మాన్ ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ 81వ సెషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ఆయన సైప్రస్ దౌత్యవేత్త ఆండ్రియాస్ కాకౌరిస్పై విజయం సాధించారు. 193 సభ్య దేశాలున్న యూఎన్ లో రహ్మాన్కు 99 ఓట్లు రాగా, కాకౌరిస్కు 91 ఓట్లు వచ్చాయి. ఐక్యరాజ్యసమితి ప్రాంతీయ రొటేషన్ పద్ధతి ప్రకారం ఈసారి ఆసియా-పసిఫిక్ గ్రూప్నకు అధ్యక్ష అవకాశం దక్కింది. డాక్టర్ ఖలీలుర్ రహ్మాన్ ఎన్నికపై విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఎక్స్ ద్వారా అభినందనలు తెలిపారు. ఉమ్మడి ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్లడానికి, బహుళ పక్ష సహకారాన్ని బలోపేతం చేయడానికి ఆయనతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పార్వతనేని హరీష్ కూడా రహ్మాన్కు శుభాకాంక్షలు తెలియజేశారు. స్ైకిల్ంగ్ ద్ావ్రా శ్ారీరక దృఢతవ్ం, మ్ానసిక ఉల్ాల్సం: క్ేందర్ మంత్ిర్ మనుస్ఖ్ మ్ాండవ్ీయ

## సైక్లింగ్ ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం: కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ

June 3 న ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ దేశ ప్రజలకు, యువతకు ప్రత్యేక పిలుపునిచ్చారు. సైక్లింగ్ను కేవలం ఒక వ్యాయామం లేదా అభిరుచిగా మాత్రమే చూడకుండా, ప్రతి ఒక్కరూ దీనిని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రజలందరికీ ప్రపంచ సైకిల్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి.. ఆరోగ్యకరమైన జీవనశైలికి సైక్లింగ్ ఒక అద్భుతమైన మార్గమన్నారు. సైకిల్ తొక్కడం వల్ల శరీరం ఫిట్గా ఉండటంతో పాటు, రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు అవసరమైన శక్తి లభిస్తుందని చెప్పారు.

## ఆరావళి పర్వత శ్రేణుల రక్షణపై సుప్రీంకోర్టు కీలక కమిటీ ఏర్పాటు

ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం, సరిహద్దుల గుర్తింపుపై కేంద్ర ప్రభుత్వం సమర్పించిన నివేదికను స్వతంత్రంగా సమీక్షించేందుకు సుప్రీంకోర్టు ఒక ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జనరల్ కాంచన్ దేవి ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు. ఈ ఏడాది ఆగస్టు 31 లోగా నివేదికను సమర్పించాలని సుప్రీంకోర్టు ఈ ప్యానెల్ను ఆదేశించింది. ఆరావళి పర్యావరణ వ్యవస్థ రక్షణకు సంబంధించిన కీలక సమస్యలను పరిష్కరించడానికి నిష్పాక్షికమైన, శాస్త్రీయమైన అంచనా అవసరమని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. గత ఏడాది అక్టోబర్లో పర్యావరణ మంత్రిత్వ శాఖ సమర్పించిన నివేదిక అమలుపై కోర్టు ఇదివరకే స్టే విధించింది, స్వతంత్ర నిపుణులతో తాజా సమీక్షకు ఆదేశించింది.

ఆరావళి కొండలను గుర్తించడానికి ప్రతిపాదించిన నిబంధనల వల్ల పర్యావరణ పరిరక్షణ పరిధిలోని ప్రాంతం గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉందా, పర్యావరణ సున్నిత ప్రాంతాలలో మైనింగ్ లేదా ఇతర కార్యకలాపాలకు ఇది అనుమతినిస్తుందా అనే అంశాలను ఈ కమిటీ పరిశీలించనుంది. కేంద్ర ప్రభుత్వ నివేదికలో ఉపయోగించిన ఎత్తు ప్రమాణాల శాస్త్రీయ ప్రాతిపదికను కూడా ఈ ప్యానెల్ అంచనా వేస్తుంది. ఆరావళి శ్రేణిని రక్షించడానికి ప్రస్తుత నియంత్రణ యంత్రాంగాలు సరిపోతాయా లేదా అనే కోణంలోనూ సమీక్షిస్తుంది. కాగా, ఈ ఉన్నత స్థాయి కమిటీలో అటవీ, భూగర్భ శాస్త్రం, పర్యావరణం, పర్యావరణ వ్యవస్థలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉన్నారు.

## వికసిత్ భారత్-2047 సంకల్పంలో ఆదివాసీలు భాగం కావాలి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఆదివాసీ, గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు రోడ్ మ్యాప్ రూపొందించి, అమలు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో ITDA/ITDP బలోపేతం చేయడంపై జరిగిన జాతీయ సదస్సులో ప్రసంగించారు. ఆదివాసీల, గిరిజనుల అభివృద్ధి జరిగినప్పుడే దేశం మరింత ముందుకెళుతుందన్నారు. వికసిత్ భారత్-2047 సంకల్పంలో ఆదివాసీలు భాగం కావాలన్నారు. గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

## ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని భావించాం: కేటీఆర్

ప్రాంతీయ వాదం ఉగ్రవాదం కంటే ప్రమాదకరం అన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుపట్టారు. ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం ప్రాంతీయ వాదమా? అని ప్రశ్నించారు. దేశభక్తి గురించి తాము పవన్ కల్యాణ్ వద్ద పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. నిజాం సర్కార్కు వ్యతిరేకంగా పోరాటం చేసిన నేల తెలంగాణ అని గుర్తు చేశారు. ఇవాళ సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.

ఈ సందర్భంగా తెలంగాణలో జనసేన కొత్తగా పోటీ చేసేది ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు. 2023 ఎన్నికల్లో బీజేపీతో కలిసి తెలంగాణలో జనసేన పోటీ చేశారని ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లోనూ పవన్ పోటీ చేశారని గుర్తు చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా, కళాకారుడిగా పవన్ కల్యాణ్ను అభిమానిస్తాం, గౌరవిస్తామన్నారు. కానీ వచ్చి తెలంగాణ సెక్రటేరియట్లో కూర్చుని తమపై ఆధిపత్యం చలాయిస్తానంటే ఊరుకోమన్నారు. తెలంగాణలో కేసీఆర్ పాలనలో సుసంపన్నమైన రాష్ట్రాన్ని ఆవిష్కరించామన్నారు కేటీఆర్. ఈ పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ క్రమంగా ప్రపంచ స్థాయి రవాణా కేంద్రంగా మారుతోంది: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ క్రమంగా ప్రపంచ స్థాయి రవాణా కేంద్రంగా మారుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో ఒకటైన సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్టేషన్ పునర వ్యవస్థీకరణకు సంబంధించి వివరాలను పంచుకున్నారు. 180 రైళ్లు, రోజుకి 1.5లక్షలకు పైగా ప్రయాణికులతో సేవలు అందిస్తోందన్నారు. 714 కోట్ల రూపాయలతో చేపట్టిన పునరాభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఇప్పటికే 64%పనులు పూర్తయినట్టు కేంద్ర మంత్రి తెలిపారు.

## ఆంధ్ర రాష్ట్రానికి అసలైన గుర్తింపును, ఉనికిని పొట్టి శ్రీరాములు కల్పించారు

తెలుగు ప్రజల ఆత్మగౌరవం, ఆంధ్రరాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అమరావతిలోని శాఖమూరులో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు స్మృతి వనాన్ని ఆయన బుధవారం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్రానికి అసలైన గుర్తింపును, ఉనికిని పొట్టి శ్రీరాములు కల్పించారని చెప్పారు. ఆయన ప్రాణత్యాగం వల్లే స్వతంత్ర భారతదేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు జరిగిందని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## భారత్ - లావోస్ నాగరికత సంబంధాలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హర్షం

బౌద్ధమతం, రామాయణం వంటి ఉమ్మడి వారసత్వాల వల్ల భారతదేశం, లావోస్ దేశాల మధ్య అత్యంత సన్నిహిత నాగరికత సంబంధాలు ఉన్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పాటైన 70వ వార్షికోత్సవాన్ని ఈ ఏడాది జరుపుకుంటున్నామని, ఇది ద్వైపాక్షిక సంబంధాలలో ఒక ముఖ్యమైన మైలురాయి అని ద్రౌపది ముర్ము అభివర్ణించారు. బుధవారం రాష్ట్రపతి భవన్లో లావోస్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి థాంగ్సవన్ ఫోమ్విహానేకు రాష్ట్రపతి ముర్ము ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. అక్టోబర్ 2024లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆసియాన్ సంబంధిత సదస్సులలో పాల్గొనడానికి లావోస్లో పర్యటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ పర్యటనలో కుదిరిన పలు ఒప్పందాలు ఇరు దేశాల మధ్య సహకారానికి సరికొత్త వేగాన్ని అందించాయని తెలిపారు. భారత్ - లావోస్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం వృద్ధి చెందినప్పటికీ, పెట్టుబడులు, వాణిజ్య రంగాల్లో మరింత పురోగతి సాధించడానికి ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, నీటిపారుదల, ఉత్పాదక రంగం, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వంటి రంగాలలో లావోస్తో సహకారాన్ని విస్తరించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని రాష్ట్రపతి స్పష్టం చేశారు.

ఇరు దేశాల మధ్య అభివృద్ధి భాగస్వామ్యం మరింత బలోపేతం కావడంపై, అది లావోస్ యువత ఆకాంక్షలకు, ఆ దేశ సామాజిక-ఆర్థిక అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా ఉండటంపై రాష్ట్రపతి ముర్ము సంతోషం వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య ఉన్న ఈ సన్నిహిత సహకారం ఇరు దేశాల ప్రజలకు ఎనలేని ప్రయోజనాలను చేకూరుస్తుందని ఇద్దరు నేతలు అంగీకరించారు.

## కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన షిల్లాంగ్ లో ఈశాన్య కౌన్సిల్ 73వ ప్లీనరీ సమావేశం ప్రారంభం

మేఘాలయ రాజధాని షిల్లాంగ్లో ఈశాన్య కౌన్సిల్ 73వ ప్లీనరీ సమావేశం ప్రారంభమైంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈ ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, మేఘాలయ గవర్నర్ సి.హెచ్. విజయ్ శంకర్, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కాన్రాడ్ కె. సంగ్మా, కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్, కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, డోనర్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, త్రిపుర, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈశాన్య కౌన్సిల్ చట్టం, 1971 కింద ఏర్పాటు చేయబడిన ఈ ఈశాన్య కౌన్సిల్ (NEC), ఈశాన్య ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అత్యున్నత ప్రాంతీయ ప్రణాళికా సంస్థగా పనిచేస్తోంది. ఈ ప్రాంతంలో సమన్వయ వృద్ధిని పెంపొందించడంలో, సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయడంలో ఈ కౌన్సిల్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది.

## న్యూఢిల్లీలో భారత్ - వెనిజులా ద్వైపాక్షిక చర్చలు.. ఇంధన భద్రత, పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ కీలక చర్చలు జరిపారు. ఈ చర్చలలో భారత్ - వెనిజులా ద్వైపాక్షిక సంబంధాల పూర్తి స్థాయి అంశాలతో పాటు ఇంధన భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, ఫార్మాస్యూటికల్స్, ఆరోగ్య సంరక్షణ, రవాణా, పునరుత్పాదక ఇంధన రంగాలలో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకునే మార్గాలపై సమీక్షిస్తున్నారు. ఐదు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం న్యూఢిల్లీ డెల్సీ రోడ్రిగ్స్ చేరుకున్నారు. ఆమె వెంట ఆ దేశ విదేశాంగ, ఆర్థిక-వాణిజ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ, రవాణా శాఖల మంత్రులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఉంది.

భారతదేశ సాంకేతిక, పారిశ్రామిక సామర్థ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించడానికి, పరస్పర సహకార అవకాశాలను అన్వేషించడానికి వెనిజులా ప్రతినిధి బృందం ఇంధన, ఫార్మా, ఆటో రంగాలకు చెందిన పలు కీలక ప్రాంతాలను సందర్శించనున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంధనం, పెట్టుబడుల రంగాలలో వెనిజులాకు భారతదేశం ఎప్పటినుంచో ఒక ముఖ్యమైన భాగస్వామిగా కొనసాగుతోంది. భారత ప్రభుత్వ రంగ సంస్థలు వెనిజులా ఇంధన రంగంలో ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టాయి, అక్కడ తమ ఉనికిని మరింత విస్తరించుకోనున్నాయి. వెనిజులా ఉన్నత స్థాయి బృందం జరుపుతున్న ఈ పర్యటన ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి, విభిన్న రంగాలలో పరస్పర భాగస్వామ్యాన్ని మరింత లోతుగా మార్చడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

## తెలంగాణలో రెండు జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్

తెలంగాణలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ రెండు జాతీయ రహదారులను నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్ర మంత్రివర్గం కీలక ఆమోదం తెలిపింది. మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టనున్న ఈ ప్రాజెక్టు రాష్ట్ర పరిధిలో రోడ్డు నెట్వర్క్ను గణనీయంగా మెరుగుపరచనుంది. రెండు జాతీయ రహదారులను కలిపి మొత్తం 190.76 కిలోమీటర్ల పొడవునా ఈ విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ భారీ రహదారుల విస్తరణ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 7,597 కోట్లకు పైగా నిధులను వెచ్చించనుంది. ఈ జాతీయ రహదారుల విస్తరణ ద్వారా అంతరాష్ట్ర రవాణా సులభతరం కావడమే కాకుండా, ప్రయాణ సమయం, ఇంధన ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. అలాగే, వాణిజ్య పరంగా ఈ మార్గాలు కీలకమైనవి కావడంతో ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి, స్థానిక ఉపాధి అవకాశాల పెరుగుదలకు ఈ ప్రాజెక్టు ఎంతగానో దోహదపడనుంది.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. “ప్రకృతి స్ఫూర్తితో.. వాతావరణం కోసం, మన భవిష్యత్తు కోసం” అనే ఇతివృత్తంతో ఈ ఏడాది పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతిని పరిరక్షించవలసిన ఆవశ్యకత పట్ల ప్రజలలో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూన్ 5వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. అడవుల నరికివేత, వాహనాలను, ప్లాస్టిక్ ను ఎక్కువగా వినియోగించడం, పంట భూముల్లో ఎరువుల వాడకం వంటి కారణాల వల్ల వాతావరణం కలుషితమై పర్యావరణ సమతూకం దెబ్బతింటోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను విరివిగా పెంచి వాహనాలను, విద్యుత్తు పరిమితంగా వినియోగించి ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని, ఈ దిశగా అందరూ కృషి చేయాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు.

## ఫీల్డ్ కమాండర్ల ఆర్థిక అధికారాలను రెట్టింపు చేసిన రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్

రక్షణ రంగ కార్యాచరణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఫీల్డ్ కమాండర్ల ఆర్థిక అధికారాల పరిమితిని రెట్టింపు చేస్తూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. మెడికల్, వర్క్స్ ప్రాజెక్టులతో కూడిన సాయుధ దళాల సవరించిన ఆర్థిక అధికారాల బదలాయింపు విధానాన్ని న్యూఢిల్లీలో రాజ్‌నాథ్ సింగ్ విడుదల చేశారు. ప్రస్తుత సంవత్సర బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా, ఈ సవరించిన నిబంధనల ద్వారా రెవెన్యూ మార్గంలో రూ.1.25 లక్షల కోట్ల కంటే ఎక్కువ విలువైన కొనుగోళ్లను సులభతరం చేయవచ్చని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఆర్థిక అధికారాల పెంపుదల 100 శాతం వరకు, కొన్ని సందర్భాల్లో అంతకంటే ఎక్కువ అంటే రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ మార్పులు ఫీల్డ్ కమాండర్ల కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఒప్పందాల ముగింపు, ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయడానికి తోడ్పడతాయని వెల్లడించింది.



ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ కమాండర్లకు కేటాయించిన ప్రత్యేక ఆర్థిక అధికారాలను గణనీయంగా పెంచారు. అత్యవసర కార్యాచరణ అవసరాలను తీర్చడానికి కేటాయించిన మొత్తం పరిమితిలో 100 శాతం పెరుగుదల కనిపించింది. గత ఏడాది అక్టోబర్‌లో నోటిఫై చేసిన సవరించిన రక్షణ కొనుగోలు మాన్యువల్‌తో పాటు, ఈ కొత్త ఆర్థిక అధికారాల బదలాయింపు విధానం వేగవంతమైన నిర్ణయాల ద్వారా రక్షణ రంగ కొనుగోళ్లకు మరింత ఊతం ఇస్తుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది రక్షణ దళాల అవసరాలకు అనుగుణంగా వనరులు సకాలంలో అందుబాటులో ఉండేలా చూస్తుంది.

## విమానయాన విధానం-2026కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

ఆంధ్రప్రదేశ్ విమానయాన విధానం-2026కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల వివరాలను రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వెల్లడించారు. వచ్చే నెల 1 వ తేదీ నుంచి వీబీ-జీ-రాంజీ పథకం అమలుకు ఆమోదం తెలిపిందని చెప్పారు.మానవ అవయవాల మార్పిడి చట్టం అమలుకు ఆర్డినెన్స్ జారీ ప్రతిపాదనకు, పోలవరం సహా ఇతర సాగునీటి ప్రాజెక్టు పనులకు పరిపాలనా అనుమతుల మంజూరును మంత్రి వర్గం ఆమోదించిందని తెలిపారు. తిరుపతిలోని శ్రీ సిటీలో ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలియజేశారు.

## సాంకేతికత, నైపుణ్యాభివృద్ధిపై తెలంగాణ - జర్మనీ తూరింగియా రాష్ట్రాల ఒప్పందం



తెలంగాణ, జర్మనీలోని తూరింగియా రాష్ట్రం మధ్య ఒక సహకార ఒప్పందం కుదిరింది. సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్లు, ఆవిష్కరణలు, జీవ శాస్త్రాలు, అధునాతన తయారీ రంగాలపై దృష్టి సారించి ఇరు ప్రాంతాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. హైదరాబాద్ పర్యటనలో భాగంగా తూరింగియా మంత్రి అధ్యక్షుడు మారియో వోయిట్, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కలిసి కొత్త సహకార మార్గాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఏఐ యుగపు నైపుణ్యాలతో యువతను సన్నద్ధం చేయడం తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల శ్రామిక శక్తిని తయారు చేయాలన్న తెలంగాణ దార్శనికతను నొక్కి చెప్పారు. విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థలలో నైపుణ్య శిక్షణను మెరుగుపరచడంతో పాటు, హైదరాబాద్లో జర్మన్ భాషా శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు కోరింది. తెలంగాణ ఆర్థిక వృద్ధిని తూరింగియా మంత్రి అధ్యక్షుడు మారియో వోయిట్ ప్రశంసించారు. తెలంగాణ పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థతో భాగస్వామ్యం కావడానికి తూరింగియా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## వర్షాభావ పరిస్థితులపై రైతులను అప్రమత్తం చేయండి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశాల నేపథ్యంలో రైతులను ముందుగానే అప్రమత్తం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులతో వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామసభల ద్వారా రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే పంటలు, వర్షాభావాన్ని తట్టుకునే రకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సన్నరకం వరి, ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు తెలిపారు. పొలాల్లో పంట వ్యర్థాల కాల్చివేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరోవైపు కొహెడలో రూ.2,284 కోట్లతో నిర్మించనున్న అంతర్జాతీయ పండ్ల మార్కెట్కు ఈ నెల 6వ తేదీన శంకుస్థాపన జరగనుంది. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు.

## విమాన ప్రయాణికులకు ఊరట.. ఇంధన నిల్వలపై కేంద్రం భరోసా

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా పెరుగుతున్న ఇంధన ధరల భారం విమాన ప్రయాణికులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విమాన ఇంధన ధరల స్థిరీకరణ కోసం రూ.10,000 కోట్ల ఒకేసారి బడ్జెట్ మద్దతును అందించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నిర్ణయం ప్రజల ప్రయోజనాల కోసమేనని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ డైరెక్టర్ రోహిత్ రాజ్ తెలిపారు. ఇది సబ్సిడీ కాదని, ఇంధన ధరల హెచ్చుతగ్గుల ప్రభావాన్ని తగ్గించే తాత్కాలిక స్థిరీకరణ పద్ధతి మాత్రమేనని స్పష్టం చేశారు. దీనివల్ల ప్రయాణికులకు తక్కువ ధరలకే విమాన సేవలు అందుతాయని, దేశవ్యాప్తంగా విమాన సర్వీసులు అంతరాయం లేకుండా కొనసాగుతాయని చెప్పారు.

ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రముఖ విమానయాన సంస్థ 'స్పైస్జెట్' హర్షం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రస్తుత పరిస్థితుల్లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి దోహదపడుతుందని స్పైస్జెట్ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

## వరల్డ్ బాక్సింగ్ ర్యాంకింగ్స్లో భారత బాక్సర్ల హవా.. నంబర్ 1 స్థానాల్లో జైస్మిన్, మీనాక్షి




తాజా వరల్డ్ బాక్సింగ్ ర్యాంకింగ్స్లో భారతదేశం తన బలమైన ఉనికిని చాటుకుంది. మహిళల 57 కేజీల విభాగంలో భారత బాక్సర్ జైస్మిన్ లాంబోరియా ప్రపంచ నంబర్ 1 స్థానానికి చేరుకోగా, ఆసియా ఛాంపియన్లు ప్రియా ఘంగాస్ (60 కేజీలు), విశ్వనాథ్ సురేష్ (50 కేజీలు) తమ తమ విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లోకి దూసుకెళ్లారు. మీనాక్షి 48 కేజీల విభాగంలో ప్రపంచ నంబర్ 1 స్థానంలో తన ఆధిక్యాన్ని కొనసాగిస్తున్నారు. ప్రీతి 54 కేజీల విభాగంలో మూడో స్థానానికి చేరుకున్నారు. 70 కేజీల విభాగంలో అరుంధతి చౌదరి, 80 కేజీల విభాగంలో పూజా రాణి, ప్లస్ 80 కేజీల విభాగంలో నుపుర్ ప్రపంచ నంబర్ 2 ర్యాంకులను దక్కించుకున్నారు. స్టార్ బాక్సర్లు నిఖత్ జరీన్ (51 కేజీలు), లవ్లినా బోర్గోహైన్ (75 కేజీలు) ప్రపంచ అత్యుత్తమ బాక్సర్ల జాబితాలో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు.

పురుషుల విభాగంలో సచిన్ సివాచ్, నరేందర్ బెర్వాల్ అంతర్జాతీయ పోటీల్లో వరుస విజయాల తర్వాత వీరు టాప్ 5 లోకి ప్రవేశించారు. హితేష్ గులియా 70 కేజీల విభాగంలో తన 6వ ర్యాంకును నిలబెట్టుకున్నారు. అభినాష్ జమ్వాల్ 65 కేజీల విభాగంలో ప్రపంచంలో 8వ స్థానంలో నిలిచారు. 75 కేజీల విభాగంలో ఆకాష్, 85 కేజీల విభాగంలో లోకేష్ కూడా టాప్ 10 లోకి ప్రవేశించారు.

# కాశీమజిలీ కథలు



## కాశీమజిలీ కథలు-ఏడవ భాగం


డా. మాదిరాజు బ్రహ్మానంద రావు

రాముడు భయపడుతున్న ఆ కన్య వద్దకు వచ్చి ఆమె గురించి అడిగాడు. ఆమె తన గురించి ఇట్లా చెప్పింది. "ఆర్యా! నేను కుంతల దేశాధిపతి శతకీర్తి కుమార్తె కనకప్రభను. నాతండ్రి నా వివాహనిమిత్తమై స్వయంవరాన్ని ప్రకటిస్తే దొంగమాటుగా వచ్చిన ఈ దొంగలు నన్ను అపహరించుకొని దేవికి బలియివ్వటానికి యిక్కడకు తెచ్చారు. నేను మిమ్ములను చూడగనే వరించాను. నా పినతల్లి కూతురు పద్మగంధి అనే ఆమెకు కనులు కనిపించక పోవటం చేత –ఈ మధ్యనే ఒక మహానుభావుడు ఆమెకు కంటి చూపు తెప్పించి పెళ్లాడాడని విన్నాను. " అంటూ ఆమె తన గురించి చెప్పుకొంది. రాముడామెను తన మరదలుగా గుర్తించి " ఓ మరదలా! ఆ పద్మగంధికి భర్తను తానే" నన్నాడు. కనకప్రభ ఆనందానికి అంతేలేక పోయింది. అప్పటికప్పుడే వారిద్దరు గాంధర్వ విధిచే పెండ్లాడారు.

కనకప్రభ - రాముడు కలిసి అడవిలో పగలెల్లా ప్రయాణం చేస్తూ రాత్రి వేళకు ఒక కోయపల్లెకు చేరారు. అక్కడ కోయదొర యెవరో తెలిసికొని వానిని ఆ రాత్రికి తమకు బస కల్పించమని కోరారు. కనకప్రభను చూడగనే కోయదొరకు ఆమెపై ఆశ పుట్టింది. ఆ రాత్రి తన యింటిలో చోటిచ్చాడు.ప్రయాణించే అలసిపోయిన ఆదంపతులు వెంటనే నిద్రపోయారు. సామాన్యంగా కోయలకు మంత్రతంత్రాలు తెలుస్తాయి. కోయదొర అర్ధరాత్రి రామునిపై మంత్రాక్షతలు చల్లి అతణ్ణి ఓ కుక్కగా మార్చాడు. అతడు కనకవల్లి దగ్గరకు వచ్చి 'నేను నీ మొగుణ్ణి కుక్కగా చేశానని- ఇక నీవు నన్ను పెళ్లాడవలసిందే'నని బలవంతపెట్టసాగాడు. కోయదొర పరమ మూర్ఖుడని తెలుసుకున్న కనకప్రభ వానిని మోసంతోనే లొంగదీసుకోవాలని భావించింది. ఆమె కోయదొరతో ఇక్కడ మనం కాపురం పెట్టామంటే నీ పెళ్లానికి కోపం వస్తుంది. మనమెక్కడకైనా పారిపోదామనగా– వాడామెను వెంటబెట్టుకొని వంగదేశం వైపు తీసుకొని పోసాగాడు. మాటల సందర్భంలో తాము వంగదేశానికి పోతున్నామని అది తన పినతల్లి దేశమే నని కనకప్రభ గ్రహించింది. కనకప్రభ కుక్కగా మారిన పతి మెడకు తాడు కట్టి తన వెంట తీసుకుపోతున్నది. ఆమె మాటవరుసగా కోయదొరతో ఈ కుక్కను మనిషిగా మార్చమన్నది. "ఆవిద్య తాను

నేర్చుకోలేదని-హేలానగరంలో ఒక సత్రంలో ఉండే బైరాగికే ఈ విద్య తెలుసు" కోయదొర చెప్పాడు.

కనకప్రభకు కోయవాని పెండ్లి వేధింపులు ఎక్కువయ్యాయి. తన పెండ్లాడమని మార్గమధ్యంలో బలవంతపెట్టసాగాడు. ఆమె చివరకో నిశ్చయానికి వచ్చింది. త్రోవలోఒక పెద్ద చెట్టు కనిపించగా తమ కులాచారం ప్రకారం మొదట చెట్టుకు మ్రొక్కి దానిని మోపెడు పూలతో పూజించి సాష్టాంగ నమస్కారాలు చేసిన తరువాత పెండ్లాడాలని చెప్పింది. కోయదొర చేత పూజకు అవసరమైన పూలను తెప్పించింది. అతనిని ఆ చెట్టునకు సాష్టాంగ నమస్కారం చేయమంది. అతడు కత్తి మొదలైన తన ఆయుధాలను పక్కనపెట్టి సాష్టాంగ నమస్కారం చేస్తుండగా ఆ కత్తితో కోయదొర మెడ నరికింది. తన అందమే తనకు ప్రమాదమని భావించి ఆమె తన ముఖానికి నల్లరంగు పూసుకొని ఆ కుక్కని వెంబడి తీసుకొని ముందుకు ప్రయాణం చేసి కొన్నిరోజులకు హేలానగరం చేరుకున్నది.




*****

వ-ర-ప్ర-సా-దుల కథ లోని ప్రవరుని కథ

రాముని కథ కొంతసేపట్లా ఉంచి మఱ్ఱిచెట్టు పడమటి కొమ్మనెక్కి వెళ్లిన విప్రకుమారుడైన ప్రవరుని కథకు వద్దాం.

ప్రవరుడు పడమటివైపునున్న మఱ్ఱికొమ్మమీద మూడు రోజులు ప్రయాణం చేసి కొమ్మ చివరకు చేరుకున్నాడు.అక్కడ అంతా అడవి.ఆ అడవిలో సన్నని దారి వెంట నడుస్తున్నాడు. ఇంతలో కొందరు దొంగలు అతనిని కత్తులతో అటకాయించి-అతని ఒంటిపై నగలను విలువైన బట్టలను ఆభరణాలను దోచుకొని- ఒక మురికి బట్ట ఆతనికి కట్టబెట్టి వెళ్లిపోయారు. అతడడవిలో కనబడిన మార్గంలో వెళ్తూ సాయంకాలానికి ఒక పట్టణం చేరుకొని అలసటతో రాజు గారి కోట వద్ద గల గుఱ్ఱపు శాల అరుగుపై పడుకుని నిద్రపోయాడు. ఒక జాము అట్లా నిద్ర పోయిన తర్వాత అతనికి మెలకువ వచ్చింది. ఆరోజు అమావాస్య అవటం చేత అంతా కటిక చీకటి అలముకొని ఉంది. ఇంతలో అంతఃపురం మేడపై నుండి ఒక ఇనుప గొలుసు వేలాడబడింది. ఆ గొలుసును ఆసరా తీసుకొని పదహారేళ్ల కన్య ఒకామె గుఱ్ఱపుశాల వద్ద దిగింది. ఆమె పడుకొని ఉన్న ప్రవరుని వద్దకు వచ్చి అతని వీపు తడుముతూ లేపి 'పద వెళదా'మంటూ దగ్గర ఉన్న గుఱ్ఱాన్ని ఎక్కమని తాను కూడా మరో గుఱ్ఱంపై బయలుదేరింది. ఆమె గుఱ్ఱంపై ముందు వెళుతుండగా ప్రవరుడు

ఆమె వెనుక మరో గుఱ్ఱంపై వెళుతున్నాడు.

ఈ కథను వింటున్న గోపునకు ఇట్లా అర్ధరాత్రి వేళ పారిపోతున్న 'ఈమె ఎవరా' అనే అనుమానం వచ్చి గురువు మణిసిద్ధుని అడిగాడు. మణిసిద్ధుడు ఆమెను గుఱించి-తరువాత జరిగిన కథ గుఱించి ఇట్లా చెప్పసాగాడు.

ప్రవరునితో పారిపోయి వస్తున్న ఆ కన్య ఆ పట్టణపు రాజు కూతురు కాంచనవల్లి. లేక లేక కలిగిన కూతురవటంతో రాజామెను విద్యాపారంగతను చేయాలనుకొని చిన్నతనంలోనే ఒక గురువు వద్ద ఆమెను చేర్పించాడు. ఆమెతో పాటు మంత్రి కుమారుడైన జయంతుడు కూడా ఆ గురువు వద్దనే చేరాడు. వారికి పదహారేండ్లు వచ్చేసరికి వారి విద్యాభ్యాసం పూర్తయింది. కాంచనవల్లికి జయంతునకు మధ్య విద్యతోపాటు ప్రేమానుబంధాలు కూడా ఏర్పడ్డాయి.

కుమార్తెకు పెండ్లీడు రావటంతో రాజదంపతులు ఒక వరుని నిశ్చయించి పెండ్లికి ఏర్పాటు చేయసాగారు. ఈ విషయాన్ని తెలుసుకొన్న కాంచనవల్లి జయంతునకు చెప్పింది. పెద్దలనెదిరించటం సాధ్యంకాదని ఇద్దరు కలిసి దేశాన్ని విడిచి యెట్లైనా పారిపోయేటందుకు నిశ్చయించుకున్నారు. తాను 'అమావాస్య రోజు గుఱ్ఱపుశాల వద్దకు వస్తానని-ఆ సమయానికి జయంతుని కూడా అక్కడకు రమ్మ' ని కాంచనవల్లి జయంతునకు చెప్పింది. అనుకున్న ప్రకారమే కాంచనవల్లి గుఱ్ఱపుశాల వద్దకు వచ్చింది. జయంతుడు అనుకున్న ప్రకారం రాలేక పోయాడు. ఆ రోజున వేరే దేశం నుండి వచ్చిన ఒక వేశ్య సంగీత పాండిత్యాదులను పరీక్షించడానికి రాజు ఆదేశంపై తండ్రియైన మంత్రి నిర్బంధంపై రాజసభకు పరీక్షకునిగా వెళ్లవలసి రావటంతో జయంతుడు తామనుకొన్న సంకేత స్థలానికి రాలేక పోయాడు. కాంచనవల్లి తనతో వస్తున్నది జయంతుడే అని భ్రమించింది. ఆ రాత్రంతా కాంచనవల్లి ప్రవరులు ప్రయాణం చేసి ఉదయానికి ఒక నదీతీరానికి చేరుకున్నారు. తనతో పాటు మురికిగుడ్డలతో వస్తున్న ప్రవరుని చూసి ఆమె ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది. ఏదో పొరపాటు జరిగిందని అనుకొని మౌనంగా ఉంది. ప్రవరుడు కూడాఏమీ మాట్లాడలేదు. ఆమె నదికి ఆవలివైపు నున్న పట్టణానికి చేరుకోవాలనుకొన్నది. నదిని దాటించటానికి ఓడ నడిపేవాడు కొంత డబ్బును తీసుకుంటాడు. ఆ సమయంలో ఒక వృద్ధ బ్రాహ్మణ స్త్రీ డబ్బులు లేక ఓడవానికి తనను నదిని దాటించమని బ్రతిమాలుతున్నది. అయినా ఓడవాడొప్పుకోవటం లేదు. అప్పుడు కాంచనవల్లి తన వద్దనున్న ఒకనాణేన్ని ఓడవానికిచ్చి ఆమెను కూడా తమతో పాటు నదిని దాటించమంది. వీరిద్దరూ దంపతులను భావించిన ఆ వృద్ధబ్రాహ్మణి కాంచనవల్లితో 'తాను దిక్కులేనిదాన్ననీ మీ యిద్దరికి సేవ చేస్తూ మీ వద్దనే ఉంటా'నంటూ వారిద్దరితోపాటు రాసాగింది.

నదిని దాటి వారు ముగ్గురు కొంత దూరం ప్రయాణం చేసి మధ్యాహ్న సమయానికి హేలాపురానికి చేరుకొని ఒక సత్రంలో బస చేశారు. ఇంతకుముందు రాముని కథలో కూడా కుక్కగా మారిన రామునితో హేలాపురానికి వచ్చిందని విషయం మీకు గుర్తుంది కదా!

మరునాడు ప్రవరుడు బ్రాహ్మణ వేషాన్నిధరించి వ్యాపారస్థుల వీధికి వెళ్లాడు. 'తానొక జ్యోతిష్యుడనని -కుటుంబంతో సహా ఈ దేశానికి బ్రతుకుతెరువుకై వచ్చా'నని వ్యాపారస్థు లకు తనను తాను పరిచయం చేసుకొని 'వారికి నక్షత్రాల ఆధారంగా రోజువారి భవిష్యత్ ఫలితాలను చెపుతా' నన్నాడు. అతని తేజస్సును చూసిన వ్యాపారులు అతనిని గౌరవించి తమకు రోజువారి జాతకాలను చెప్పమని కోరారు. వర్తకులు అతని కుటుంబానికి కావలసిన సరుకులు ఇచ్చారు. దైవానుకూలంగా ప్రవరుడు చెప్పిన జ్యోతిష్యం వర్తకులపట్ల సానుకూలంగా ఫలించడంతో వారికాతనిపై గురి కుదిరింది. అతనికి రోజురోజుకు వర్తకులలోను రాజ్యం లోను మంచి పేరు రాసాగింది. ప్రవరునకు జ్యోతిష్యమందే కాక రత్నపరీక్షలోనూ నైపుణ్యం ఉన్నదని తెలుసుకొన్న ఒక రత్నాలవర్తకుడు ఆతనిని రత్నపరీక్షకుడిగా తన కొలువులో చేర్చుకున్నాడు. గొప్ప రత్నపరీక్షకునిగా కూడా అతనికి కీర్తి వచ్చింది.

ఒకరోజు పరాయి దేశస్థుడైన ఒక రత్నాల వర్తకుడు రాజు వద్దకు ఒక రత్నాన్ని తెచ్చి దాని విలువ కోటి రూపాయలని చెప్పి రాజునకారత్నాన్ని అమ్మజూపాడు. ప్రవరుని పేరు విన్న రాజాతనిని పిలిపించి ఆ రత్నం విలువ కట్టమని అడగ్గా ఇది కృత్రిమరత్నమని వట్టి గాజురాయియని - ఒక గవ్వ విలువ కూడా దీనికుండదని నిరూపించాడు. దీంతో రాజు ప్రవరుని తన కొలువులో రత్నపరీక్షకుడిగా నియమించుకున్నాడు. కొంత కాలానికి రాజుగారి ముఖ్య ప్రధాని మరణించగా ఆ మంత్రిస్థానంలో ప్రవరుని ముఖ్యమంత్రిగా రాజు నియమించాడు. ఈ విధంగా ప్రవరుడంచెలంచెలుగా దేశప్రధానమంత్రి స్థానానికి ఎదిగాడు. ఇంత జరుగుతున్నా కాంచనవల్లి గాని -వారివద్ద నున్న వృద్ధబ్రాహ్మణిగాని-ప్రవరుడు గాని ఎదురుపడి ఒకరితోనొకరు మాట్లాడుకోలేదు. తామెవరన్న విషయం ముగ్గురిలో వారిలో వారికే తెలియదు.

ప్రవరుడు మంత్రిగా ధర్మబద్ధుడై న్యాయ మార్గాన్ని అనుసరిస్తూ ప్రజలకు తీర్పులనిస్తూ గొప్ప మంత్రిగా కీర్తి గడించి రాజ్యాన్ని నడపసాగాడు. ప్రజలతన్ని ధర్మ ప్రభువుగా కీర్తింప సాగారు.

ఒకరోజు రాజైన కందర్పకేతు ప్రవరునితో 'తాను ద్వీపాంతరం నుండి ఒక స్త్రీని తెప్పించానిని-ఆమె తనను వివాహమాడటానికి ఒప్పుకోవటం లేదని- ఆమెనెట్లానైనా తనకనుకూలంగా ఒప్పించమని కోరాడు. రాజు కోరినమీదట ప్రవరుడు రాజుచే నిర్బంధింపబడిన స్త్రీ వద్దకు వెళ్లి ఆమెను గుఱించి అడిగాడు. ఆమె తాను వసంతుని వివాహ

(49 వ పేజీ చూడండి)

# క్షమ యొక్క ఔన్నత్యం



పాలకుర్తి రామమూర్తి

క్షమ అంటే ఓరిమి లేదా సహనం. సహనం ఎన్నో సమస్యలను పరిష్కరిస్తుంది. ఒకరి తప్పిదాలను క్షమించడం వల్ల వ్యక్తి ఔన్నత్యం ఉన్నతీకరించ బడుతుంది. నిద్రావస్థలో ఉన్న తన అయిదుగురు కుమారులను (ఉప పాండవులను) అశ్వత్థామ సంహరించినా, అతనిని క్షమించింది, ద్రౌపది. వ్యక్తి పురోగతిని దెబ్బతీయాలని బహిర్గత శత్రువులే కాక ఆరుగురు అంతరంగ శత్రువులు (కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు) కాచుకొని కూర్చుంటారు. చిన్న అజాగ్రత్త, ప్రమత్తత అరిషడ్వర్గానికి ఆశ్రయం ఇస్తుంది.. పతనావస్థకు దారిచూపుతుంది.

ఈ జగత్తులో పండిత పామరులు ఎవరైనా కాలానికి బద్ధులు. కాలాన్ని అధిగమించాలి లేదా దానిని లొంగదీసుకోవాలి అంటే క్షమ లేదా ఓరిమియే మహత్తరమైన ఔషదం, అంటారు. ఒక మహా వృక్షం తనను నరుకుతున్న వానికి కూడా నీడను ఇచ్చినట్లే.. క్షమను సాధించిన వారు తమకు అపకారం చేసిన వారికి కూడా ఉపకారం చేస్తారు. నేను సాధకుడిని, తపో విభవం కలవాడిని, జ్ఞానవంతుడిని అనుకున్న వారి గర్వాన్ని అణిచి వేసేది కూడా క్షమా రహిత మనస్సే. క్షమ లేదా ఓరిమి లేదా సహనం ఉత్తమ వ్యక్తులకు ఆభరణం లాంటిది. దానిని ధరించినంత కాలం జ్ఞానం కాని, తపస్సు కాని స్థిరత్వాన్ని కలిగియుంటాయి. ఎప్పుడైతే క్షమ దూరమౌతుందో.. అప్పుడు జ్ఞానం స్రవించిపోతుంది.. తపస్సు నీరుగారిపోతుంది.

ప్రయత్న పుర్వకంగా నైనా క్షమను (ఓర్పు, సహనం) సాధించాలి.. నిలుపుకోవాలి. అలా నిలుపుకో గలిగిన వారు క్షమను కాపాడుతారు, అంటారు. ఇక్కడ క్షమ అంటే భూమి. నిశ్చలమైన క్షమ ఎవరిలో నైతే ఉంటుందో.. వారు సర్వ కర్మలయందునా సమర్థులు (క్షములు) గా ఉంటారు, అంటున్నాయి, సుభాషితాలు. అజ్ఞానులు దుఃఖాన్ని భరించలేని శాపంగా భావిస్తారు. దానిని ఉపశమింప చేసుకునేందుకై సకల దిక్కులకూ పరుగులు తీస్తారు.. కాని దుఃఖోపశమనం పొందరు. ధైర్యవంతులు దుఃఖానికి కంగారు పడరు. క్షమతోనే (సహనంతో) దుఃఖాన్ని నిగ్రహించుకుంటారు. కదలకుండా ఉన్న బురద నీరైనా పైకి తేటగా ఎలాగైతే మారుతుందో అలాగే క్షమ వల్ల దుఃఖంలోనూ శాంతి కలుగుతుంది. ప్రశాంతమైన మనస్సు ఆలోచనలను సకారాత్మకమైన దిశలో, సరైన మార్గంలో నడిపిస్తుంది. సరైన ఆలోచనలు సరైన కార్యాన్ని సరైన విధానంలో ముగించేందుకు ప్రేరణనిస్తాయి. దానితో విజయం సిద్ధిస్తుంది. వీటన్నింటికీ మూలమైనది క్షమ లేదా సహనం. ఎన్ని విఘ్నాలు ఎదురైనా విజయాన్ని సాధించేదాక విశ్రమించకుండా ప్రేరణ నిచ్చేది సహనమే.

నిజానికి, కోపానికి కోపంతో ప్రతీకారం తీర్చుకుంటే శత్రుత్వం పెరుగుతుంది. క్షమతో స్పందిస్తే మనుషులు మారతారు.. సమాజ స్థాయి ఉన్నతమౌతుంది. ఎదుటివారిని క్షమించడం బలహీనత కాదు, అది మనిషి గొప్పతనానికి, ఉన్నత వ్యక్తిత్వానికి చిహ్నం. క్షమ శత్రువుని కూడా మిత్రునిగా మార్చగలదు.

పాండవులు అరణ్యవాసం చేస్తూ కష్టాలు పడుతున్న సమయంలో, వారిని తమ ఔన్నత్యాన్ని, వైభవాన్ని, దర్పాన్ని ప్రదర్శించి పరిహసించి, అవహేళన చేయాలనే ఉద్దేశ్యంతో కౌరవులు ఘోషయాత్రను చేపట్టారు. శత్రుజన ఖేదంబును, మిత్రజన మోదంబునుం గదా సంపద-

లకుం దగియెడు ఫలంబులు అంటూ దుర్యోధనుని ఆధ్వర్యవంలో కౌరవులు అంతఃపుర కాంతలతో మహావైభవంగా అడవికి వెళ్ళారు. అయితే అక్కడ గంధర్వులతో జరిగిన వాగ్వాదం యుద్ధానికి దారి తీసి గంధర్వులు యుద్ధంలో దుర్యోధనుని బంధిస్తారు. ఈ వార్త తెలిసినప్పుడు భీముడు, కాగల కార్యము గంధర్వులే తీర్చారని చెపుతూ.. దుర్యోధనుడు తన కర్మఫలాన్ని అనుభవిస్తున్నాడని సంతోషిస్తాడు. కానీ యుధిష్ఠిరుడు మాత్రం అలా ఆలోచించలేదు. "మన మధ్య విభేదాలు ఉన్నా, వారు మన సోదరులే. వారి అవమానం మన వంశానికే అవమానం" అని చెప్పి, దుర్యోధనుడిని విముక్తి చేయాలని ఆదేశించాడు. యుధిష్ఠిరుని ఆజ్ఞమేరకు పాండవులు గంధర్వులతో యుద్ధం చేసి దుర్యోధనుడిని రక్షించారు.

ఈ ఘట్టంలో ధర్మరాజు ప్రవర్తన ఉదాత్తమైన క్షమాగుణానికి అద్భుతమైన ఉదాహరణ. తమకు ఎన్నో అపకారాలు చేసిన దుర్యోధనుడిపై ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చినప్పటికీ, యుధిష్ఠిరుడు వ్యక్తిగత క్షమను, క్షాత్రధర్మాన్ని, వంశ ఔన్నత్యాన్ని ప్రదర్శించి దుర్యోధనుని రక్షించాడు. శత్రువు కష్టంలో ఉన్నప్పుడు అతనికి సహాయం చేయడం నిజమైన క్షమాగుణానికి నిదర్శనం. ఇలాంటి ఔదార్యాలను శత్రువుల పట్ల ప్రదర్శించడం వల్లనే ఒక విధంగా చూస్తే.. యుధిష్ఠిరుడు ధర్మరాజుగా ప్రశస్తిని పొందాడు, అనుకోవచ్చు.



సహనంలేని వ్యక్తులు ఆలోచనా రహితులై తమ దుందుడుకు చర్యలతో ఆపదల పాలవుతారు. తదుపరి చింతించినా ఉపయోగం ఉండదు. దీనికి ఉదాహరణగా పంచతంత్రంలో ముంగీస కథ ఒకటి ఉన్నది. ఒక కుటుంబం ఒక ముంగీసను ప్రేమగా పెంచుకునేది. ఒకనాడు ఇంటి యజమాని బయటకు వెళ్ళగా యజమానురాలు తన చిన్న కుమారుని ఊయలలో పడుకోబెట్టి ముంగీసను కావలి బెట్టి మంచినీటికై వెళ్ళింది. అంతలో ఒక పాము ఊయలవైపు రాసాగింది. దానిని చూచిన ముంగీస దానిపై దాడిచేసి ముక్కలుగా చంపేసింది. ఆ క్రమంలో దాని నోటికి పాదాలకు పాము రక్తం అంటుకున్నది. ఇంతలో యజమానురాలు వస్తున్నది. ఆమెను చూచిన ముంగీస తన ప్రతాపాన్ని చూపాలనే ఆతురతతో ఆమె ముందుకు వెళ్ళింది. ముంగీసను, దానికి ఉన్న రక్తాన్ని చూచిన యజమానురాలు ఆ ముంగీస తన కుమారుని చంపేసిందనే అనుమానంతో మంచినీటి బిందెతో దాని తలపై మోదింది.దానితో ముంగీస అక్కడికక్కడే మరణించింది. యజమానురాలు లోనికి వెళ్ళి చూస్తే బాబు ఊయలలో నిద్రిస్తున్నాడు, చుట్టూ పాము శరీరం ముక్కలుగా పడి ఉన్నది. విషయం అర్థం అయింది. అయినా చేయగలిగింది లేక తన తొందరపాటును తిట్టుకుంటూ దుఃఖించింది. ఆ క్రమంలో ఒక్క నిమిషం పాటు సహనాన్ని పాటించి లోనికి వెళ్ళి చూస్తే ఆ అనర్థం రాకపోయేది.

నిజానికి క్షమ అనేది కేవలం ఒక గుణం మాత్రమే కాదు; అది వ్యక్తిత్వాన్ని ఉన్నతీకరించే మహత్తరమైన శక్తి. సమాజాన్ని సంస్కరించి, సమున్నతంగా నిలిపే ఉదాత్తమైన సాధనం, మానవత్వాన్ని పరిమళింపచేసే మహోన్నత మానవతా ధర్మం.

- పాలకుర్తి రామమూర్తి

# తూర్పు గోదావరి జిల్లా__ చారిత్రిక నేపథ్యం



డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

(తరువాయి భాగం-2)

రాజ రాజ నరేంద్రుని తరువాత అతని కుమారుడు రాజేంద్ర చోళుడు రాజ్యాన్ని పరిపాలించాడు. ఇతడు కాంచీపురం, వేంగీ రాజ్యాలకు రాజయ్యాడు. తూర్పు గోదావరి జిల్లాలో చాళుక్య , చోళ యువరాజు-లు ప్రతినిధులుగా ఉండే వారు. వారి రాజధాని ద్రాక్షా రామం.

వీరి పరిపాలనా సమయంలోనే తమిళ ద్రావిడ బ్రాహ్మణులు తూర్పుగోదావరీ జిల్లాకు వలస వచ్చారు. వీరు తమిళనాడులోని తంజావూరు జిల్లా కుంభకోణం దగ్గర "వల్లంగి" అనే గ్రామంనుండి వలస వచ్చారు. వీరు మొదట ర్యాలి గ్రామానికి వచ్చారు . వీరు నివసించే ప్రాంతాన్ని " అరవ వీధి " అని నేటికి పిలుస్తున్నారు. ర్యాలి జగన్మోహిని దేవాలయం చాళుక్యుల కాలంలోనే నిర్మించబడింది.

చాళక్యుల కాలంలో అమలాపురం దగ్గర ఉన్న "పేరూరు " తమిళులకు దానంగా ఇవ్వబడింది. ర్యాలినుండి కొన్ని కుటుంబాలు ఇక్కడకు వచ్చాయి . ఇక్కడ "పేరు " తెలుగు పదం కాదు. ",పెరియ" అను తమిళ పదంనుండి వచ్చింది . పెరియ అంటే పెద్దలు అని అర్ధం. పెదలు నివసించే ఊరు కనుక పెరియ ఊరు అని పిలిచే వారు. ఆ పదం కాలక్రమేణ పేరూరుగా మారింది. ఇక్కడికి వీరు ఎందుకు వచ్చారు? అన్న ప్రశ్నకు ఒక సమాధానంఉంది.

" చాళక్యులకు కొమర గిరి పట్టణం వేసవి విడిదిగా ఉండేది. "అని కీ.శే . రాజోలు నివాసి, ఎడ్వకేట్. మైలవరపు సీతారామయ్య గారు చెబుతూ ఉండే వారు. వారికి , తెలుగు , చరిత్ర అంశాలలో మంచి ప్రవేశం ఉంది . ఆ రోజులలో నేను వారి మాటకు ప్రాధాన్యం ఇవ్వక పోయినా కాలక్రమేణ ఆలోచిస్తే వారు చెప్పింది నిజమే అనే అభిప్రాయానికి వచ్చాను . రాజులు ఎక్కడికి వెడితే అక్కడ అన్ని జాతుల వారికి నివాస ప్రాంతాలు ఏర్పాటు చేసే వారు . అదేవిధంగా ఈ బ్రాహ్మణులకు ఈ ప్రాంతాన్ని దానం చేసారు. పైగా కొమరిగిరి పట్టణం సముద్ర తీరం ,రెండు వైపుల గోదావరి నది, మధ్య భాగం .చుట్టు కొబ్బరి తోటలు .అందువలన చాళుక్యులు ఈ ప్రాంతాన్ని వేసవి విడిదిగా వాడుకున్నారు అని భావించవచ్చు.

ఈ పేరూరు ద్రావిడులను ఆరామద్రావిడులు అని పిలిచ వారు. వీరు నివసించే ప్రాంతం అంతా తోటలతో నిండి ఉండేది. అందువలన వీరిని ఆరామ ద్రావిదులు అని పిలిచే వారు. ఆరామం అంటే తోట అని అర్ధం .వీరు కాల క్రమేణ విజయనగరం వైపు వలస వెళ్ళారు.

చాళక్యుల కాలంలోనే తూర్పుగోదావరి జిల్లాలోని కొత్తపేట దగ్గర పలివెల గ్రామంలో ఉమా కొప్పులింగేశ్వర ఆలయాన్ని నిర్మించారు . రెడ్డి రాజుల కాలంలో ఈ దేవాలయం అబివృద్ధి చెందింది.

ఇదేవిధంగా చాళుక్య , చోళ రాజు అయిన " వీర చోడుడు " కొంతమంది అరవల-ను తీసుకు వచ్చి , పిఠాపురం దగ్గర " వీరచోడ చతుర్వేద మంగళం " అనే గ్రామాన్ని దానం చేసాడు . వీరు విద్యార్ధులకు శాస్త్ర విషయాలను బోధిస్తూ ఉండే వారు .

12,వ. శ. వెలనాటి చోళులు రాజ్యాన్ని పాలించారు . వీరి కాలంలోనివాడే పండితారాధ్యు-డు . ఇతడు శివతత్వ సారం రచించాడు . ఇతడు ద్రాక్షారామంలో జన్మించాడు . 12వ. శ . చివరి భాగంలో

తూర్పు చాళుక్యుడైన విష్ణువర్ధన మల్లపరాజు పిఠాపురాన్ని పాలించాడు . ఇతనిని వెలనాటి చోళ రాజయిన పృధ్వీశ్వరుడు జయిం చాడు . వెలనాటి చోళుల చివరి భాగంలో సామంతులు స్వతంత్రత ప్రకటించుకున్నారు . అట్టి వారిలో హైహయ వంశజులు ఒకరు . వీరు రాజోలు , అమలాపురం ప్రాంతాలు పాలించారు .



తరువాత ఈ ప్రాంతం కాకతీయుల శం యింది . 14వ. శ. ప్రారంభంలో కాకతీయులు తూర్పుగోదావరిని పాలించారు .ప్రతాపరుద్రుడు పెద్ద మల్లరాజు , చిన్న మల్లరాజును తనకు సామంతులుగా ఈ ప్రాంతంలో నియమించాడు . వీరి పాలన అరాచకం ఎక్కువ అవడం మూలాన వీరిని తొలగించి తానే స్వయంగా పరి పాలించాడు . ప్రతాపరుద్రుని కాలంలోనే తెలగాణ్యులు అను బ్రాహ్మణ శాఖీయులు ఈ ప్రాంతానికి వచ్చి ఉండ వచ్చు . 1323 లో మహ్మద్ తుగ్లక్ కాకతీయులను జయించి ఈ ప్రాంతాన్ని స్వాధీన పరచుకొన్నాడు . రాజమహేంద్ర వరాన్ని పాలించడానికి " సాల్వర్ ఉన్నీ " అను వానిని ప్రతి నిధిగా నియమించాడు . ఇతడు రాజమహేంద్ర వరం మైన్ రోడ్ లో ఉన్న మసీదును నిర్మించాడు . అక్కడ పూర్వం వేణు గోపాల స్వామి దేవాలయం ఉండేది . ఆ దేవాలయాన్ని ధ్వంసం చేసి సాల్వర్ ఉన్నీ మసీదును నిమించాడు . ఈ వేణు గోపాల స్వామి దేవాలయం నేడు కంభంవారి సత్రం వెనకాల ఉంది .

1325 ప్రాతంలో ప్రోలయ నాయకుని ఆధ్వర్యంలో డిల్లీ సుల్తానులపై తిరుగు బాటు జరిగింది . ఈ సమయంలోనే తూర్పుగోదావరి జిల్లా లోని కోరుకొండ సామ్రాజ్యం ఏర్పడింది . తూర్పుగోదావరి జిల్లా చిన్న చిన్న రాజ్యాలుగా ఏర్పడ్డాయి . ప్రోలయ నాయకుని తమ్ముడయిన కాపయ నాయకుడు ఓరుగల్లులో రాజ్యాన్ని ఏర్పాటు చేసాడు.రాజమహేంద్ర వరంలో " అన పోతా నాయకుని " తన ప్రతినిధిగా నియమించాడు . ఇతడు మరణించిన తరువాత ముమ్మడి నాయకుడు ఈ రాజ్యాన్ని స్వాధీన పాచుకొన్నాడు . ఇతడు కోరుకొండ రాజ్యాన్ని పాలిస్తూ ఉండే వాడు . ఇతడు తన తమ్ముడైన "సింగ నాయకుని .కోటిపల్లి ప్రాంతానికి , గన్నయ నాయకిని తాటి పాకకు పాలకులుగా నియమించాడు . సింగమ నాయకుని రాజధాని ముమ్మిడి వరం. ముమ్మడి నాయకుని కాలంలో కోరు కొండలొని నరసింహ దేవాలయం నిర్మించబడింది .

కుమారగిరి రెడ్డి 1384-1402 కాలంలో తూపు గోదావరి జిల్లాను పరిపాలించాడు . ఇతని పేరుతో తూర్పుగోదావరి జిల్లాలో రెండు గ్రామాలు ఉన్నాయి . ఒకటి కోమరగిరి, రెండవది కొమరగిరి పట్టణం . ఏర్పడ్డాయి కొమరగిరి పట్టణం సముద్రతీర గ్రామమం .ఇక్కడే ఓడలరేవు అనే గ్రామం ఉంది . రెడ్డి రాజుల కాలంలో అవచి తిప్పయశెట్టి అను వ్యాపారి సముద్రం మీద వ్యాపారం చేసేవాడు. ఇతడు శ్రీ నాధుని కావ్యాన్ని అంకితం తీసుకున్న ధన వంతుడు . ఇతడు బహుసా కొమరగిరి పట్టణంనుండే సముద్ర వ్యాపారం చేసి ఉండవచ్చు .

14.వ శ. చివరి భాగంలో కాటయ వేమారెడ్డి పెద్దాపురం లోని కిమ్మూరు,(కోండ్రు కోట) బెండపూడి దుర్గాన్ని ,రాజమహేంద్ర వర దుర్గాన్ని ,కొప్పుల రాజ్యాన్ని జయించి , సింహాచలం వరకు వ్యాపించాడు . కొప్పుల రాజ్య వంశీయులు , హైహయ వంశీ యులు కాటయ వేమారెడ్డికి సామంతులుగా ఉన్నారు. కుమార గిరి రెడ్డి అనంతరం కాటయ వేమారెడ్డి రాజమహేంద్ర వరాన్ని స్వతంత్రంగా పరిపాలించాడు . ఇతని తరువాత అన్నదేవ చోళుడు రాజమహేంద్ర వరం రాజ్యంలో కొంత భాగాన్ని ఆక్రమించి కొద్ది కాలం రాజ్య పాలన చేసాడు .

(ఇంకా వుంది)

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు...15వ భాగం

సమస్త సంపదలకు అధిపతి యైన శ్రీ మహా లక్ష్మి దేవిని శ్రీ మన్నారాయణుడు తన సర్వ-స్వం గా భావించి ఆమెను తన ధర్మపత్నిగా స్వీకరించి ఆమెకు తన హృదయం లో స్థాన మిచ్చి స్వామి వారు గౌరవించ-డం జరిగింది.అయితే ఆమె శ్రీ మన్నా రావణుని పాదాల చెంత ఉండి పాదాలు ఒత్తుతూ పాద దాసి గా సేవ చేస్తూ ఉండటం ఏమిటని మనకు అని పిస్తుంది. కానీ మనకు తెలియని విధంగా ఒక సందేశాన్ని లక్ష్మీదేవి మనకు తెలియజేస్తోంది. అది ఈ స్వామి పాదాలే మనకు రక్ష" అని ఆ పాదాలను భక్తి శ్రద్ధలతో ఆరాధించే వారికి ఈలోకంలో , పరలోకంలో సమస్త సుఖ సంతోషములు, సంప-దలను పొందవచ్చు నని తె-లియజేస్తోంది . ఆమె అసలు స్వామి వారి ని వదలి ఉండ లేదు .అయినా మన అందరి కోసం స్వామి పై కోపించి స్వామి వారి ని వదలి ఈభూమి పైకి దిగి రావడం కూడా తన సంతానంగా భావించే మన అందరి రక్షణ కోసమే. అసలు కలియుగంలో ఈభూమి పైన అధర్మం ఎక్కు-వగా ఉంటుంది గాన స్వామి వారు నేను రానన్నారు, అయితే స్వామి భూమి పైన ఉంటేనే మనకు రక్షణ ఉంటుందని లక్ష్మీదేవి భావించి మన పట్ల జాలితో ఆతల్లి ఆలా చేసిందని పెద్దలు తెలియ జేస్తారు.

భృగుమహర్షి శ్రీ మన్నా రావణుని వదిలి వెళ్ళి న తరువాత లక్ష్మీ-దేవి స్వామి వారి కి నమస్కరిం-చి వారితో మీ హృదయ స్థానం నేనుండే చోటు ఆస్థానాన్ని భృ-గుమహర్షి కాలితో తన్నారు అంటే నన్ను తన్ని నట్లే అయితే మీరు ఆయనను శిక్షించలేదు కాని గౌరవించి పంపారు.నేను ఈ అవమానాన్ని భరించ లేను గాన ఇంక మీ తో ఉండలేను" కరవీర పురం". వెళ్ళి పోతు-న్నానని చెప్పి వెళ్ళి పోయింది. అమ్మవారు ఎప్పుడూ శ్రీ మన్నా రావణుని వదిలి ఉండలేదు కదా అలా ఎందుకు చేసింది? అని ప్రశ్నించుకుంటే శ్రీ మన్నా రాయణుడు సాధు సజ్జనుల రక్షణ కు ధర్మ సంస్థాపనకు త్రేతా-యుగంలో శ్రీరామచంద్రుని గా ద్వాపరయుగంలో శ్రీకృష్ణుని గా అవతరించి. ధర్మం కోసం ఎంత కష్టపడినా ధర్మం తగ్గి అధర్మం పెరుగు తూనే వచ్చింది.కలి-యుగానికి అధర్మం మూడు పాళ్ళకు పెరిగింది. ఆకారణంగా కలియుగంలో నేను అవతరిం-చనని శ్రీ మన్నారాయణుడు తె-లియజేయగా భూమి పై తన సంతానం ఎటు వంటి ఇబ్బందు-లు ఎదుర్కోవలసి వస్తుందో నన్న భయం తో ఆలోచిస్తుంటే భృగు-మహర్షి రావడం విష్ణుమూర్తి వక్ష-స్థలం పైన అనగా తాను ఉన్న స్థానాన్ని తన్నడం ఆ వంకతో తాను భూమి పైకి వస్తే స్వామి వారు కూడా భూమి పైకి వస్తారని అప్పుడే సకలజీవరాశి ప్రశాంతం గా ఉంటుందని ఆలోచించి అలా చేసింది .

లక్ష్మీదేవి లేని చోటులో తాను ఉండలేక శ్రీ మన్నారాయణు-డు మానవ శరీరంతో ఈ భూమి పైకి వచ్చి గతంలో ఆదిశేషు-ని ఈభూమిపై ఒక కొండ గా ఉండమని కోరగా ఆయన అం-గీకరించడం జరిగింది. (ఈ వి-షయాన్ని గతంలోచెప్పుకున్నాం ) .అయితే పాల కడలి లో స్వామిని కలవడానికి వచ్చిన వాయుదేవుని తో ఆదిశేషుడు ఇప్పుడు స్వామి వారు నిద్రలో ఉన్నారు తరువాత రమ్మన్నారు . వాయుదేవుని కి కోపం వచ్చింది .ఇద్దరి మధ్యా మాటలు యుద్ధం కొనసాగింది . అది పెరిగి ఒకరి నొకరు గర్వంతో వారి వారి గొప్పలు చెప్పుకునే స్థాయిలో మాటలు యుద్ధం కొనసాగు-తోంది .ఆ సమయం లో శ్రీ నారాయణుడు వచ్చి మీలో ఎవరు గొప్పవారో నాకూ తెలుసు కోవాలని ఉంది అనడంతో ఆది-

శేషుడు పర్వతాన్ని చుట్టుకొని గట్టి గా పట్టుకోగా వాయుదేవుడు శ్రీ మన్నా రావణుని అనుగ్రహంతో ఆనాడు ఆ కొండ ను భూమి పై పడే విధంగా చేశారు. ఇది నా వల్లనే జరిగిందని వారికి గొడవలు లేకుండా సర్ది చెప్పి ఆ కొండకు స్వామి వారు శేషాద్రి అని పేరు పెట్టారు . ఇప్పుడు స్వామి భూమి పై గల ఆ శేషాద్రి కొండను చేరారు.ఆకొండపై అనేక రకాల పూలు, పండ్ల చెట్లు,గంధం వంటి అనేక రకాల చెట్లు దేవతలు, పితృదేవతలు, యక్షులు , కిన్నెరులు మునీశ్వరులు అనేక రకముల అడివి మృగములు ,పక్షులు అనేకం నివశిస్తున్నాయి.. శ్రీ మన్నారాయణుడు శేషాద్రి యందలి పరిసరాలన్ని పరిశీలించి ఇది తాను ఉండుటకు తగిన స్థలముగా భావించి ఒక చింత చెట్టు క్రింద పుట్టలో నుండి భూదేవి బయటకు వచ్చి స్వామిని ఆహ్వానించగా ఆ చెట్టు క్రింద ఒక పుట్ట లో దాగి ఉండుటకు సౌకర్యం గా ఉందని భావించి ఆ పుట్టలో ఉన్నారు.

అక్కడ కు దగ్గరలో "స్వామి పుష్కరిణీ" ఉంది. గతంలో సరస్వతీ దేవి శ్రీ మన్నారాయణుని ప్రార్థించగా నీ కు ఏ వరం కావాలో కోరుకోమన్నారు.దానికి ఆమె స్వామీ అన్ని నదుల కన్నా నా పేరు తో ఏర్పడి న నది గొప్పనది కావాలను కున్నా అయితే ఆ అవకాశం నా కుమారుడైన "పులస్త్యుడు "గంగ కు కల్పించాడు. అసలు నాకు ఉన్నతమైన గొప్ప నదిగా పేరు పొందాలని స్వామి వారిని ప్రార్థించగా... స్వామి ... నేను రాబోయే కలియుగం లో శ్రీ వేంకటేశ్వర స్వామి గా అవతరిస్తా నీవు నదిగా గాక అన్నింటి కన్నా ఉన్నత మైన "స్వామి పుష్కరిణి "గా మారి నేను అవతరించ బోయే శేషాద్రి యందు నాకు ఈశాన్య భాగంలో ఉంటే నీకు మంచి కీర్తి లభిస్తుందని తెలియజేయగా సరస్వతీ దేవి శేషాద్రి పై స్వామి పుష్కరిణి గా స్వామి అనుగ్రహంతో. అవతరించింది.

సాధారణంగా ప్రతీ ధనుర్మాసం లో -శుక్లపక్షం-ద్వాదశి తిథి -నాడు సకల తీర్థములు ఈ పుష్కరిణిలో కలుస్తాయి.గాన ఆనాడు స్వామి పుష్కరిణిలో స్నానం చేస్తే సమస్త తీర్థములలో స్నానం చేసిన ఫలం లభిస్తుందని మహర్షులు తెలియజేశారు.

ఈ స్వామి పుష్కరిణిలో స్నానం చేసి చనిపోయిన వారి మాతా పితరులకు బంధువులకు శ్రార్థకర్మలు నిర్వహిస్తే వారికి శాశ్వత వైకుంఠ లోకం లభిస్తుందని , ఇందు స్నానం చేసి దానధర్మములు ఆచరించిన వారికి కోరుకున్న కోర్కెలు నెరవేరును .శంఖుడు అను రాజు స్వామి పుష్కరిణిలో స్నానం చేయడం వల్ల పోగొట్టుకున్న తన రాజ్యం తిరిగి సంపాదించు కున్నాడు.అంగీరస మహర్షి పుత్రుడు నారాయణుడు స్వామి పుష్కరిణి లో స్నానం చేసి శ్రీ నివాసుని ధ్యానం చేయడం వల్ల శాశ్వతంగా "వైకుంఠం లోకం లో స్థానం లభించింది.

"వశిష్ఠుల వారు"స్వామి పుష్కరిణిలో స్నానం వల్ల ఒక్కసారిగా" ఏడు జన్మలపాపం నశిస్తుందని" తెలియజేశారు.

"వ్యాసులవారు" స్వామి పుష్కరిణిలో స్నానం వల్ల "ఘోర పాపాలు" నశిస్తాయి అంతే కాదు" సమస్త సంపదలు లభిస్తాయి".

"అత్రి మహర్షి " " తద్విష్ణో" అనే మంత్రం తో స్వామి పుష్కరిణిలో స్నానం "చేస్తే సమస్త పాపాలు నశిస్తాయి."

"పరాశర మహర్షి "స్వామి పుష్కరిణిలో స్నానం వల్ల "నరకాన్ని దాట వచ్చు."

"గౌతమ మహర్షి". స్వామి పుష్కరిణి పేరు చెప్పి ఎక్కడ స్నానం చేసినా స్వామి పుష్కరిణిలో స్నానం చేయడం వల్ల లభించే ఫలమే లభిస్తుంది సందేహం లేదన్నారు.

వీరే కాదు భరద్వాజుడు,మనువు, యాజ్ఞవల్క్య మహర్షి,హరీతుడు,అంగీరసుడు, మొదలైనవారు అంతా ఒక్కమాటలో " స్వామి పుష్కరిణి " అంటే "చాలు సమస్త పాపాలు నశిస్తాయని" తెలియజేశారు.

సరస్వతీ దేవికి స్వామి వారు ఇచ్చిన మాట ప్రకారం స్వామి వారు వైకుంఠం నుండి మానవరూపంలో భూమి పై కి వచ్చి శేషాచలము లేదా వేంకటాచలము పై స్వామి పుష్కరిణి తీరమున నున్న చింత చెట్టు క్రింద నున్న పుట్టలో ప్రవేశించా-

# శ్రీ ఆంజనేయం

## ధారావాహిక




డా॥కె.రామానందం

క్వధిత స్వర్ణవర్ణాంగ ముష్ట ధ్వజ సమన్వితం
చతుర్భుజ ధరం శాంతం సర్వ వ్యాపినమీశ్వరమ్ ॥

బంగారు వర్ణంలో మెరిసిపోతున్న శరీరం కలిగినవాడు హనుమ. ఆయన ధ్వజ పతాకంపై ఒంటె ఉంటుంది. నాలుగు చేతులతో శాంతస్వరూపుడైన సర్వవ్యాప్తి అయిన ఈశ్వరునిగా హనుమంతున్ని ఆరాధిస్తారు.

రామాయణంలో హనుమంతుని పాత్ర అత్యంత ప్రధానమైనది. రామాయణ పాత్రల్లో రాముని తర్వాత అధికమైన దేవాలయాలు హనుమంతునికే ఉన్నాయి. రామభక్తుల వలె ఆంజనేయ భక్తులను కూడ మనం చూస్తుంటాం. భగవంతుడినీ, భక్తుడినీ సమదృష్టితో చూడగల సాంస్కృతిక వారసత్వం మనదనేందుకు శ్రీరాముడిని చూస్తే చాలు అవగతమవుతుంది. హనుమంతుడు కేవలం దేవతామూర్తి మాత్రమే కాదు, ఒక మంత్రమూర్తి, యోగ స్వరూపుడు, రాజనీతిజ్ఞుడు, యుద్ధ విశారధుడు, రామదాసు అన్నింటికి మించి మూర్తీభవించిన ధర్మమూర్తి. శ్రీరామచంద్రుని బహి: ప్రాణం అణిమాది అష్టసిద్ధులను వశం చేసుకున్న యోగ సిద్ధుడు.

వ్యాస మహర్షి తండ్రి పరాశరుడు. ఆయన హనుమంతుని చరిత్రను సమగ్రంగా తన పేరుతో పరాశర సంహితగా రచించాడు. హనుమలోని సకల గుణాలను పరాశర సంహిత విస్పష్టంగా ప్రక-



టిస్తుంది. శ్రీమద్రామాయణం ఒక వేదం. ఒక మంత్రం శ్రీరాముడు బాహ్యంగా నరుడు. అంతరంగంలో పరబ్రహ్మం. ఆయనను సేవించి తరించిన వేద స్వరూపుడు హనుమ.

హనుమ అనే పదానికి ఉపనిషదర్థం వేదం అని, మంత్రమే హనుమ. మంత్రమే శరీరంగా కలిగిన మహా పురుషుడు. మంత్రము మాత్రమే నిచ్చు ఆచార్యుడు. అతడే భగవతత్వాన్ని భజించువాడు, భరించువాడు కూడా. హనుమ శబ్దం ఒక్కటే ఆ కార్యాన్ని నిర్వహించగలదు.

కశ్యప మహర్షి సంతానం కోరి హిమాలయాలలో ఉగ్ర తపస్సు చేశాడు. అతని తపోదీక్షకు శంకరుడు మెచ్చి, అగ్ని వాయువులను పిలిచి కశ్యపునకు సహకరించమని ఆనతినిచ్చాడు. అగ్ని వాయువులిద్దరూ పలురూపాల్లో వచ్చి ఆయన పూజావిధులకు అవసరమైన పూజా సామాగ్రిని సమకూరుస్తూ సేవలందించారు. కశ్యపుని తపస్సు పండి, శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. "నువ్వే నాకు పుత్రునిగా" కావాలన్నాడు. 'తథాస్తు' అన్నాడు శివుడు. అగ్ని వాయువులు తమకు కూడా ఆ అదృష్టాన్ని దయచేయమని ప్రార్థించారు. సరేనన్నాడు.

పార్వతీ పరమేశ్వరులు వెంకటాచలంపై విహరిస్తుండగా ఒక వృక్షంపై కోతులు క్రీడిస్తుండడం

చూసారు. వారిద్దరూ కోతులుగా మారి వానర మిధునముగా క్రీడించారు. ఆ సమయంలో పరమేశ్వరుడు అంతకుముందు తనలో నిక్షిప్తమైన సకల దేవతా తేజ: పుంజాన్ని పార్వతి గర్భంలో ప్రవేశపెట్టాడు. ఆ తేజస్సు వేడిమిని భరించలేని పార్వతి దానిని అగ్నిలో ప్రవేశపెట్టింది. అగ్నికూడా దాన్ని భరించలేక వాయువులోకి ప్రవేశపెట్టాడు.

రాధాంతర కల్పంలో కశ్యపుడు కేసరి అనే వానరంగా జన్మించాడు. 'పుంజిక స్థల' అనే అప్సరస శాపం పొంది యుండడం వలన కుంజరుడనే వానర శ్రేష్టునకు కూతురిగా జన్మించింది. కుంజరుడు తన కుమార్తెకు 'అంజనా దేవి' యని పేరు పెట్టాడు. యుక్త వయస్సు రాగానే, కేసరి అనే వానరరాజుకు ఇచ్చి వివాహం జేశాడు. పూర్వజన్మ సుకృతం వల్ల కామరూపాన్ని పొందగల శక్తి గలిగినవాడు మరియు గత జన్మలో ఇతడు కశ్యపుడు, అంజనా దేవి సంతానం కోసం తపస్సు చేయుచున్నది. ఆ సమయంలో వాయుదేవుడు అగ్ని తనలో నిక్షిప్తం చేసిన సకల దేవతా తేజోపుంజాన్ని అంజనాదేవి గర్భంలో ప్రవేశపెట్టాడు. ఆమె కలవరపడింది. వాయువు అంజనాదేవి ఎదుట ప్రత్యక్షమై "లోకోద్ధారకుడైన కులదీపికుడు నీ గర్భంలో ఉదయించబోతున్నాడంటూ" చెప్పి అదృశ్యమయ్యాడు. అది విన్న అంజనీకేసరులు ఆనందపడ్డారు.

ఆమె సుందరుడైన బాలుని వైశాఖమాస బహుళ దశమి శనివారం పూర్వాభద్రా నక్షత్ర యుక్త వృశ్చిక లగ్నమందు, కర్కాటక లగ్నంలో ఆంజనేయుడు జన్మించాడు. శివుని అష్టమూర్తులలో ఒకడు వాయిదేవుడు, కశ్యపుడు, అగ్ని వాయువులకు పుత్రినిగా జన్మించాడు. అదే ఆంజనేయ అవతారం.

మకరాక్షర సంభూత: శివంతు హనుమాన్ స్మృత: అన్నాడు పరాశురుడు. అకార, ఉకార, మకార సంయోగంతో ఏర్పడిన 'ఓం' అనే ఏకాక్షరమే పరబ్రహ్మ స్వరూపం. అందులో మకరాత్మక శివుడే హనుమంతుడు శివునికి సంబంధించిన 'హర' శబ్దంలో 'హ' అనే అక్షరం హనుమంతునిగా, 'ర' అనే అక్షరం రామునిగా ప్రభవించాడని ఋషివర్యుల భావన.

దుష్టానాం శిక్షణార్థాయ ఇష్టానాం రక్షణాయ చ

రామకార్యాలతో సిద్ధ్యర్ధ్యం జాతహ శ్రీహనుమాన్ శివః॥

అంటోంది పరాశర సంహిత శిక్ష రక్షణ చేయడానికి సాక్షాత్తు పరమశివుడే రామకార్యాన్ని సిద్ధింప జే సే సంకల్పంతో హనుమంతునిగా అవతరించాడని అర్థం. ఒక పర్యాయం శివకేశవులు పరస్పరం తగాదా పెట్టుకున్నారు. శివుడికి పంతం పెరిగింది. విష్ణువుతో శివుడు గార్ధభ నిస్వడును చంపలేవనియ , ఒకవేళ అతనిని సంహరిస్తే నేను నీకు దాస్యం చేస్తానన్నాడు. విష్ణువు తోడేలుగా మారి గార్థభుని సంహరించాడు. త్రేతాయుగంలో శివుడు తన మాట ప్రకారం శ్రీరామ భక్తి పరాయణునిగా అంజనీ సుతుడు అవతరించాడు.

పసిప్రాయంలోనే సూర్యున్ని ఫలముగా భావించి, సూర్య మండలానికేగాడు. ఆ సమయంలో సూర్యుని రథం మీద రాహువు కూర్చుని సూర్యుని పట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇంతలో బాలాంజనేయులు సూర్యుని పట్టుకోవడం చూసి భయపడి ఇంద్రుని వద్దకు వచ్చి విషయాన్ని తెలుపగా, ఇంద్రుడు వెంటనే ఐరావతాన్ని ఎక్కి, సూర్య మండలం ప్రవేశించి, పసిబిడ్డ అనే ఇంగితం లేకుండా తన వజ్రాయుధంతో సుందరుని హనువుల (చెక్కిళ్ళు) మీద కొట్టాడు. ఆంజనేయుడు మూర్ఛపోయాడు. వాయ దేవుడు గాయపడిన బిడ్డను ఒక గుహలోనికి తీసుకువెళ్లాడు. అందువల్ల ప్రాణుల శరీరాల్లో వాయుప్రసారం ఆగిపోయింది. ధర్మకార్యాలు నిలిచిపోయాయి. బ్రహ్మదేవుడు గుహలోని శిశువు దేహాన్ని నిమిరి పున: జీవితాన్ని ప్రసాదించాడు. బ్రహ్మగారి సలహాపై అచ్చుటకు విచ్చేసిన దేవతలు అనేక వరాలు ఇచ్చారు. బ్రహ్మగారు చిరంజీవత్వాన్ని ఇచ్చారు. బాలుని చెక్కిళ్లకు దెబ్బ తగలడం వల్ల అతనికి హనుమంతు అనే పేరుతో వ్యవహరింపబడ్డాడు. హనుమ పేరుతో హనుమద్ప్ర-

తం లోకంలో ప్రసిద్ధి కెక్కుతుందని, ఆ వ్రతాన్ని ఎవరు ఆచరిస్తారో వారి సకల కార్యాలు నెరవేర్చమని హనుమకు ఆదేశిస్తారు.

పరమాత్మ శ్రీరాముడిగా అవతరించగా, ఆ పరమాత్మనందించడానికి, వహించడానికి హనుమగా అవతరించింది వేదం. శ్రీరాముడు బాహ్యంగా నరుడు. అంతరంగంలో పరబ్రహ్మం. ఆయనను సేవించి తరించిన వేద స్వరూపుడు హనుమ. శ్రీమద్రామాయణం వేదం. ఒక మంత్రం.

అంజనాద్రి పై ఆంజనేయుడు అల్లరిగా తిరుగుతూ అందర్నీ భయాందోళనలకు గురి చేస్తూ ఉండడంతో భృగు, అంగీరస వంశస్తులైన మహర్షులు వాని దుండగాల్ని సహించలేక ఏ బలంతో నీవు మమ్ములను బాధిస్తున్నావో ఆ బలం నీకు తెలియకుండా పోతుంది? అని శపించారు. అంజనాదేవి కూడా అంజనాద్రి పర్వతం మీద ఆ బాలాంజనేయుని కాళ్లకు, చేతులకు బేడీలు తగిలించి ఎక్కడికీ కదలకుండా శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ఎదురుగా నిలబెట్టినట్లు స్థలపురాణం చెబుతోంది. ఆయనకు శ్రీ బేడీ ఆంజనేయ స్వామి అని పేరు వచ్చింది.

బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, ఆరోగత (రోగాలేని స్వస్థత) చురుకుదనం, వాక్పటి కలిగిన అమృ త మూర్తి హనుమ. ఇన్ని సుగుణాలు, ప్రతాపము, ఉన్నప్పటికీ ఏమీ పట్టనట్లు ప్రవర్తించిన మహా యోగేశ్వరుడు. విద్యాభిలాషలతో విద్య నేర్చుకోవాలని సూర్య భగవాన్‌ని అర్థించాడు. "నేను ఎక్కడను ఆగను కదా! నా దగ్గర విద్య నేవిధంగా నేర్చుకోనగలవ"ని సూర్యభగవానుడు ప్రశ్నించాడు. దానికి సమాధానంగా తన శరీరాన్ని పెంచి ఉదయాద్రిపై నొకకాలును, అస్తాద్రి పై ఒక కాలును ఉంచి నిలిచాడు. సూర్య భగవానుదాతని శక్తిని గ్రహించి, అలనాడు బాలుడుగా తాను వరాలిచ్చింది వీనికేనని గుర్తించి విద్యాదానం చేయడానికి అంగీకరించాడు.

హనుమంతుడు సూర్యుని ముందు నడుస్తూ విద్య నేర్చుకున్నాడు. వ్యాకరణ వేత్తయై వేద వేదాంగాలు అభ్యసించాడు. మహాశాస్త్రవేత్తగా పేరు పొందాడు. సంగీత శాస్త్రకర్త అయ్యాడు. మృధుమధురంగా మాటలాడగల వక్తయని పేరు సంపాదించుకున్నాడు. సూర్యుని ఆదేశంపై, ఋష్యమూక పర్వతంపై తలదాచుకున్న సుగ్రీవునికి మంత్రిగా ప్రియ స్నేహితునిగా చేరుపై అతని రక్షణ బాధ్యతలను స్వీకరించాడు. సుగ్రీవుని సోదరుడు వాలి, సుగ్రీవుని భార్యను వాలి చెరపట్టాడు మరియు తన రాజ్యం నుండి సుగ్రీవుని తరిమి కొట్టాడు. సీతావియోగంతో, సీతను వెతుకుతూ, ఋష్యమ క పర్వతానికి చేరుకున్న రామలక్ష్మణులను హనుమ బ్రాహ్మణ రూపంలో కలిసి, వారి రాకడ వల్ల, సుగ్రీవునికి మేలు జరుగుతుందని గ్రహించి రామ సుగ్రీవుల మైత్రికి పునాది వేశాడు. ఈ మైత్రికారణంగా రాజ్యాన్ని కోల్పోయిన సుగ్రీవుడు మళ్ళీ రాజు కాగలిగాడు. రామలక్ష్మణులకు సీతాన్వేషణ సుగుమమైంది.

రామాయణంలో ఉన్న సుందరకాండను ఈ సందర్భంగా మనం ప్రస్తావించుకోవలసి వస్తుంది. లంకలో సీతమ్మ ఉన్న విషయం గ్రహించి, లంకను చేరే బృహత్కార్యాన్ని తన తలకెత్తుకున్నాడు. జాంబవంతుడు, అంగదాదుల ప్రోత్సాహంతో తన శక్తిని తెలుసుకొని సముద్రాన్ని లంఘించి, సీతాదేవిని చూసి ఆమెకు రాముని సమాచారం చెప్పి ఆమె నమ్మకాన్ని చూరగొన్నాడు. సముద్ర లంఘనం చేస్తున్నప్పుడు మధ్యలో దేవతలు పెట్టిన పరీక్షలను సునాయాసంగా తట్టుకున్నాడు. ఏకదాటిని సముద్ర లంఘనం, మైనాకుని ఆతిధ్యాన్ని తిరస్కరించడం, సురసను జయించడం, సింహిక దమనం ఈ నాలుగింటిని హనుమంతుడు తన వాక్చాతుర్యాన్ని, మైనకుని విషయంలో, సురస విషయంలో సమయస్ఫూర్తి, సింహిణి, లంకిణిల విషయాలలో భుజ బలాన్ని ప్రదర్శించి విజయుడై లంకలోకి అడుగు పెట్టాడు.

**జై ఆంజనేయం**

# మీకు తెలుసా!

మన హిందూ ధర్మం లో అనేక పండుగలు ఉన్నాయి.
ప్రతీ పండుగకు, వివాహాది శుభకార్యాలకు మామిడి తోరణాలతో (ఒక కొమ్మకు విడివిడిగా కొన్ని ఆకులు ఉంటాయి. అటువంటి కొమ్మని కట్టాలి విడివిడిగా ఆకులు అందంగా ఉంటాయని కట్టరాదు.) మనం ఉంటున్న ఇళ్ళకకు, లేదా మండలాలకు "శుభం కోసం " అలంకరించడం అనాది కాలం నుండి ఆనవాయితీ గా వస్తోంది. కాని మామిడి తోరణాల నుండి మనం పీల్చే గాలి(ఆక్సిజన్) విడుదల అవుతుందన్న విషయం మనం గ మ ని ం చ ం . . సా ధా ర ణ ం గా శుభ కార్యాలకు ఎక్కువ మంది బంధువులు హాజరు అవుతారు. గాన ఆసమయంలో మనం విడిచిన గాలి తిరిగి మనమే పీల్చు కునే అవకాశం ఎక్కువగా ఉంటుంది . మనకు ఉండే ఇరుకు గదుల వల్ల కూడా మనం విడి చిన గాలి మనమే పీల్చు కునే అవకాశం కలగ వచ్చు . విడిచిన గాలి తిరిగి పీల్చు కోవడం వల్ల మనకు అనారోగ్య సమస్యలు కలిగే అవకాశం ఉంటుంది . గాన మామిడి తోరణాలు పండుగలు, వివాహాది వేడుకలలో అలంకరిస్తే మనం విడిచిన గాలి అది తీసుకుని మనకు ఆరోగ్య కరమైన మంచి (ఆక్సిజన్) గాలి మనకు అందిస్తుంది.గాన శుభకార్యాలకు మామిడి తోరణాలు అలంక రించుట ఆనవాయితీ గా జరుగుతోందని పెద్దలు తెలియ జేస్తున్నారు

.మన చిన్నతనంలో మనకు ఊహ తెలిసిన నాటి నుండి మరణించే వరకు ఈ శరీరానికి కావలసిన అవసరాలు ఎలా తీర్చు కోవాలి అని ఆలోచిస్తూ ఉంటాము.ఆవిధమైన ఆలోచనల వల్ల తలకు సంబంధించిన అనేక నెప్పులు, లేదా వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. మనం కుంకము లేదా తిలకము వంటి. బొట్టు నుదురు పై ధరించుట (స్టిక్కరు ధరించి రాదు ) వల్ల మెదడుకు ఉపశమనం(చలువ) లభించి రోగాలు రాకుండా కాపాడు తూ ఉంటాయి. అంతేకాదు మన ముఖానికి బొట్టు అందాన్ని ఇస్తుంది.ఇతరుల దిష్టి మనకు తగల కుండా కాపాడు తుందని పెద్దలు తెలియజేస్తూ ఉంటారు.

.మనం ఆహారం మరియు పలహారములు వంటి చిరుతిళ్ళు అధికంగా భుజిస్తే అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది.గాన మనం తినేటప్పుడు పొట్టలో సగ భాగం ఆహరపదార్ధములతోను 1/4 వంతు భాగం మంచి నీటితో నింపి 1/4 వంతు భాగం ఎప్పుడూ ఖాళీ గా ఉంచాలి అప్పుడే మనం ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని పెద్దలు తెలియ జేస్తూ ఉంటారు.

మనం ఎక్కడికి వెళ్ళినా తిరిగి ఇంటికి ప్రవేశించే ముందు కాళ్ళు కడుక్కుని ఇంట్లోకి వెళ్ళడం నేర్చు కోవాలి దీని వలన కాళ్ళకు అంటిన దుమ్ము లేదా కనబడని క్రిములు వల్ల ఇంట్లో ఉన్న కుటుంబం సభ్యులకు అనారోగ్యం వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది .అలా రాకుండా తగిన జాగ్రత్తలు కోసం మనం కాళ్ళు కడుక్కుని ఇంట్లోకి ప్రవేశించటం చాలా మంచిది.

కొంతమంది బయటకు వెళ్ళారంటే వస్త్రాలు దూరంగా విడిచి స్నానం చేస్తే గాని ఇంట్లోకి రారు . ఇది ఆచారం అనుకుంటారు. ఆచారం కాదు.ఆరోగ్య సూత్రాలుగా భావించి అంతా ఆచరించాలని ధర్మశాస్త్రములు తెలియజేస్తున్నాయి. కాళ్ళు కడుక్కుని తడి కాళ్ళతో భోజనం ప్రారంభించి కాళ్ళతడి ఆరేలోపు భోజనం పూర్తి చెయ్యాలని ఆరోగ్య సూత్రాలు తెలియజేస్తున్నాయి.

మన జనాభాలో ఎక్కువ మంది ప్రజలు టేబుల్ మీల్స్ కే అలవాటు పడి ఉన్నారు.ఇది అంత మంచి పద్దతి కాదని పెద్దలు చెబుతున్నారు గాన కనీసం పిల్లల కైనా నేల పై కూర్చో బెట్టి భోజనం చేసే అలవాటు నేర్పాలి . చిన్న,పెద్ద వయస్సుతో నిమిత్తం లేకుండా అంతా వ్యాయామం చేయుట, ఉదయం,

సాయంత్రం ఆరోగ్య వంతమైన వ్యాయామం తో పాటు నడవడం వల్ల మంచి ఆరోగ్య వంతులుగా మారే అవకాశం ఉంది.

మన భారతదేశంలో గల జనులు పూర్వం నుండి హిందూ ధర్మాన్ని అనుసరించడం ఆనవాయితీ గా ఉండేది. పూర్వం నుండి ఈదేశాన్ని ముందు అంతా హిందూ దేశమని, తదుపరి భారత దేశం అని పిలిచేవారు.ముందు ఈ దేశాన్ని మన దేశీయ రాజుల. పరిపాలన కారణంగా హిందూ ధర్మం భారతదేశం అంతటా విస్తరించి ఉండేది . తదుపరి విదేశీ రాజులు, మరియు బ్రిటీష్ వారు పరిపాలన కువచ్చిన తరువాత మన భారత దేశంలో అనేక మతాలు కలిసి అఖండ భారతదేశం అయ్యింది.ఈ భారత దేశంలో ఉన్న హిందూ మతాన్ని " హిందూ ధర్మం గా"పెద్దలు పిలిచేవారు. కారణం ఈ దేశం లో మనకు తెలియ కుండా అనేక ధర్మం విషయాలు ఆచరిస్తున్నాము. వీటిని ఆచరించక పోతే ఆరోగ్య రీత్యా నష్ట పోయేది మనమే.అందులకే హిందూ మతం అనలేదు.హిందూ ధర్మం గా పేర్కొన్నారు . ప్రధానంగా ఈదేశం లో ఉండేవారు ఇక్కడి పండుగలు, సాంప్రదాయాలు అనుసరిస్తూ నే ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యం గా ఉండేది. భారతదేశంలో ఋతువులు, మాసాలు అన్నీ దృష్టిలో ఉంచుకున మనం అంతా ఆరోగ్యంగా, అనందంగా జీవించడం కోసం కొన్ని నక్షత్రాలు , తిధులు ఆధారంగా కొన్ని పండుగలు తప్పనిసరిగా చేసుకోవాలని పెద్దలు ఏర్పాటు చేయడం జరిగిందని పెద్దలు తెలియ జేస్తున్నారు.

ఉదా :--"ఉగాది"ఈ పండుగ నాడు మన మంతా ఉగాది పచ్చడి చేసుకుని తింటాము. ఇందులో తీపి,చేదు,పులుపు-,ఒగరు,కారం,కమ్మదనం అన్ని రకాల పదార్థాలను కలిపి ఉగాది పచ్చడి గా చేసుకుని భుజిస్తాము. అసలు ఉగాది నాడు ఈ పచ్చడి తినడానికి కారణం మానవ జీవితం అన్న తరువాత అనేక కష్టసుఖాలు మిళితమై కొనసాగుతూ ఉంటాయి.మనకు జీవితం లో సుఖాలు లభిస్తే పొంగి పోవడం.కష్టాలు వస్తే బాధ బెంగ తో కృంగి కృశించి పోవడం జరుగుతూ ఉంటుంది . కొంత మంది తట్టుకోలేక బలవంతం గా ప్రాణాలు తీసుకోవడం కూడా జరుగుతోంది . అలా మరణించడం మంచి పద్ధతి కాదని. ఏవైనా కష్టాలు వస్తే వాటి నన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించాలని. మనం కష్టాలకు భయపడరాదని మనలో ఈధైర్యం కలిగించడానికి పెద్దలు ఈ పండుగ ఏర్పాటు చేసినట్లు పెద్దదలు చెబుతారు.

దీపావళి :--నరకాసురుడు మరణించిన రోజు నరక చతుర్దశి మరుసటి రోజు దీపావళి గా గుర్తించి దీపావళి నాడు మతాపాలు,కాకర పువ్వత్తులు,-టపాసులు, చుచ్చుబుడ్లు వంటివి కొని తగల బెట్టడం చేస్తూ ఉంటాము . ఈ కారణంగా అందరికీ చాలా ధనం ఖర్చు అవుతూ ఉంటుంది .ఈ కారణంగా కొందరు తినడానికి, తాగడానికి కాకుండా ధనాన్ని వృధాగా బూడిద చేసేస్తున్నామని బాధపడుతూ ఉంటారు.

ఈసమయం లోనే వరి మొదలైన మన ఆహార పంటలు చేతికి అందే సమయం చేలో పంట పండి ధాన్యం కంకుల బరువుతో పంట చేను కొంత నేలపై వాలి వుంటుంది. ఈ సమయం-లో "దోమలు" పంట చేలో పడి పంటను సర్వనాశనం చేసేస్తూ-ఉంటాయి ఆదోమలను నాశనం చేసి పంట రక్షణకు దీపావళి టపాసులు కూడా ఎంతగానో ఉపయోగ పడుతూ ఉంటాయి.

గతంలో దీపావళి పండుగ జరుపు కోవడానికి వర్షం అడ్డు వచ్చి పండుగ అంతగా జరుపు కో లేక పోయారు.. వర్షం కారణంగా టపాసులు అంతగా కాల్చ లేక పోయారు . దాని వల్ల కొంత మంది కి దోమలు కుట్టి "డెంగ్యు జ్వరాలు" వచ్చి కాళ్ళు, చేతులు అంతగా స్వాధీనం లేక చాలా కాలం నేలమీద పాకడం జరిగింది.. .గాన మనం అన్ని పండుగలు జరుపుకోవాలని పెద్దలు తెలియజేస్తున్నారు.

ఈ దేశంలో పెట్రోలు, డీజిల్ వంటి ఆయిల్స్ తో నడిచే వాహనాలవల్ల వాయు కాలుష్యము

ఎక్కువగా  ఆకాశమంతా ఎక్కువగా వ్యాపించి ఉంటోంది .  .కాని  పూర్వం రోజు లలో ఆయిల్తుతో నడిచే వాహనాలు లేక పోయినా చెట్లు అధికంగా ఉండి  అడవి లా పెరిగి చెట్టు, చెట్టూ రాపిడి వంటి అనేక కారణాల వల్ల అడవులు తగులు బడి పోతూ ఉండేవి.ఈ కారణం గా వాయుకాలుష్యం అధికంగా పెరిగి గాలిలో కలవడం  ఆ గాలిని  పీల్చిన ఆనాటి మానవులకు అనారోగ్యం కలిగే అవకాశం ఉంది అని భావించి ఆరోజుల్లోనే అనేక పరిశోధనలు జరిపారు.  కొంత మంది పరిశోధకులు  ఆవు వేసిన పేడ కడిని బాగా  ఎండబెట్టి దానిని తగలబెట్టడం వల్ల వాతావరణంలో ఒక టన్ను కాలుష్యం నశిస్తుందని ఆరోజులలో శాస్త్రజ్ఞులు గమనించి భోగి పండుగ నాటి తెల్లవారు ఝామున  మన దేశంలో అందరూ  భోగి మంటలు ఏర్పాటు చేసి అందులో ఆవుపేడతో చేసిన పిడకలు ఎండబెట్టి ఉంచిన ఆకాశంలో ఏర్పడిన వాయు కాలుష్యం అంతా నశిస్తుందని  ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని  ఆరోజులలో  పెద్దలు చెప్పిన విషయాన్ని ఆనాటి పాలకులైన రాజులు భోగి పండుగ నాడు భోగి పిడకలతో  మంటలు ఏర్పాటు చేశి  వాయుకాలుష్యం తోపాటు చలి మంటలు గా కూడా ఉపయోగ పడుతుందని ఏర్పాటు చేశారు.

వినాయకచవితి  నాడు 21 రకాల ఆకుల(పత్రి)  తో మట్టి వినాయకుణ్ణి  పూజిస్తాము.ఆ ఆకులను చేతితో  తాకి తేనే మంచి  ఫలితాన్ని ఇస్తాయని  పెద్దలు చెబుతారు....పూజ అనంతరం  ఆమట్టి  వినాయ-కుని మరియు పూజించిన పత్రిని ప్రవహించే నీటిలో కలిపే యడం వల్ల నీటి కాలుష్యం తొలిగి పోతుందని పెద్దలు తెలియజేస్తున్నారు.  .పూర్వం పిల్లలకు సున్నిపిండి నలుగు పెట్టి సుమారు ఒక గంట సేపు వేడి నీళ్ళతో స్నానం చేయించే వారు.ఇప్పుడు ఆ విధానం తగ్గి పోయిన  కారణంగా కొంతమంది  పిల్లలకు ఒంటి నిండా వెంట్రుకలు వస్తున్నాయి.మారు తున్న కాలానికి అనుగుణంగా అనేక మార్పులు వస్తున్నాయి. వాటిలో మంచిని గ్రహించాలి  చెడుని వదలివేయాలి . మనం  ఈ దేశం  లో ఉంటూ సదా హిందూ ధర్మాన్ని ఆచరిస్తే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా  ఉంటామనని లేదా అనారోగ్యం పాలు అవుతామని  పెద్దలు తెలియజేస్తున్నారు. ( ఉదా :--ప్రపంచం అంతా" కరోనా" తో అధిక  శాతం  బాధ పడినవారే. అంతే కాదు మరణాల శాతం కూడా ఎక్కువ.  మన దేశాన్ని మిగిలిన దేశాలతో పోలిస్తే కరోనా రోగాల సంఖ్య తోపాటు. మరణాల సంఖ్య కూడా తక్కువ.గాన మనం హిందూ ధర్మాన్ని ఆచరిస్తూ అంతా  గర్వపడే విధంగా సమిష్టి-గా మన ధర్మాన్ని  మనం  కాపాడు కుందాం.......

---

## కాశీమజిలీ కథలు

(37 వ పేజీ తరువాయి)

మాడటం-ఒక ముసలిదాని మోసంచే రాజు నిర్బంధానికి లోనుకావటం మొదలైన తన కథనంతా చెప్పింది. అపుడు ప్రవరుడు  -కళావతి తన మిత్రుడైన  వసంతుని భార్యయని తెలుసుకొన్నాడు. ఇంతకాలము తన స్నేహితులను మర్చిపోయినందుకు విచారపడుతూ కళావతితో తన మిత్రులకథనంతా చెప్పి "అమ్మా! ఎట్లైనాసరే మా మిత్రులందరినీ  ఒక్క-చోటికి ఇక్కడకే  చేర్చా"లని నిశ్చయించుకున్నానన్నాడు. ప్రవరుడు తన మిత్రులను వె-తకటానికి తన చారులను నాలుగు దిక్కులకు పంపించాడు. తన చిత్రపటాన్ని దేశంలోని అన్ని సత్రాల  ద్వారానికి కట్టించి  "ఈ చిత్రాన్ని సాభిప్రాయంగా చూసిన వారిని తన వద్దకు తీసుకొని రమ్మ"ని భటులకు ఆదేశించాడు.

(ఇంకా వుంది)

# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వండి-అక్రెడిటేషన్ తో సంబంధం లేకుండా ఇవ్వాలి




హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది. అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

మద్దతు ప్రకటించిన కోదండరాం

సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


ఐ పి ఎల్ కప్  తిరిగి గెలిచిన
ఆనందంలో ఆర్ సి బి జట్టు
QATAR AIRWAYS
KEI
Wires & Cables
21


WORLD
ENVIRONMENT
DAY
జూన్ 5 న
ప్రపంచ పర్యావరణ దినోత్సవం


జయ జయహే తెలంగాణ ! జననీ జయకేతనం !!
TELANGANA
RISING
CURE - PURE - RARE
ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక
99 DAYS ACTION PLAN
ప్రజలందరికీ
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ
శుభాకాంక్షలు
ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం...
జారీ చేసిన వారు : సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం